RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

తెలంగాణ తల్లి

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:51 SUNDAY,JULY 19,2026 PAGES:12 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :51 ఆదివారం , జూలై 19, 2026, పేజీలు -12 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలపై ఉక్కుపాదం..

## కఠిన చట్టానికి సీఎం రేవంత్ గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్, జులై 18:** తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో **మిగతా2లో**



## తెలంగాణలో స్మార్ట్ రేషన్ కార్డులు


**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** వినియోగదారులు ఫోన్‌లో టి-రేషన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీ ద్వారా రేషన్ కార్డును లింక్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఎం-పిన్ క్రియేట్ చేసుకోవాలి. కొత్త రేషన్‌కార్డుల తయారీ ఖర్చు మొత్తాన్ని పౌర సరఫరాల శాఖనే భరిస్తుందని, కార్డుదారులపై ఎలాంటి ఆర్థిక..కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధమవుతోంది. తెలంగాణ **మిగతా2లో**

## కేటీఆర్‌కు ఉద్యోగాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు



**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** నిరుద్యోగ యువతను ఉద్దేశించి బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని ఆయన స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం **మిగతా2లో**

## అమర్‌నాథ్ యాత్ర రద్దు.. రెండు మార్గాలు మూసివేత




**తెలంగాణ పత్రిక ప్రతినిధి:** భారత వాతావరణ శాఖ జారీ చేసిన తీవ్ర వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జూలై 19 నుంచి పహల్గామ్, బల్తాల్ మార్గాల ద్వారా పవిత్ర గుహకు వెళ్లే యాత్రను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం, ఆకస్మిక వరదల ముప్పు ఉన్న నేపథ్యంలో ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టినట్లు **మిగతా2లో**

## తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం సక్సెస్

భారత అంతరిక్ష చరిత్రలో నవశకం..
స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్‌గా రికార్డు సృష్టి
శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం చారిత్రాత్మకం
ప్రధాని సందేశంతో పాటు పలు పేలోడ్లను కక్ష్యలోకి మోసుకెళ్లిన 'విక్రమ్-1'

**ధర్మఘంట :** భారత అంతరిక్ష రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశీయ ప్రైవేట్ స్పేస్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'విక్రమ్-1' ఆర్బిటాల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని **మిగతా2లో**






## నా కుటుంబానికి పెద్దన్న అందెశ్రీ

**తెలంగాణ పత్రిక :** తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ స్మృతివనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని **2లో**



## 'ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క'..

-ఉద్యోగాలపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్
-70 వేల ఉద్యోగాలపై బహిరంగ సవాల్
-నోటిఫికేషన్లు కాదు.. లూటిఫికేషన్ జరుగుతోందని విమర్శ

2




## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

- ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామన్న కోమటిరెడ్డి
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య

2

## 72వ జాతీయ అవార్డులు




- 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 'భ్రమయుగం' చిత్రానికి ఉత్తమ నటుడిగా మమ్ముట్టి ఎంపిక
- 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తీక్ ఆర్యన్ కు కూడా ఉత్తమ నటుడు అవార్డు
- ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచిన 'కమిటీ కుర్రోళ్లు'

## ఆయిల్ పామ్ రైతుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలి



**హైదరాబాద్, జులై 18:** కేంద్రంపై సంయుక్త ఒత్తిడికి దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఆయిల్ పామ్ రైతుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలని కోరారు. ప్రధాని మోదీని కలిసి ఆయిల్ పామ్ రైతుల సమస్యలు వినిపిద్దామన్నారు. **మిగతా2లో**



## హైదరాబాద్ కేబీఆర్ పార్కులో భారీ కొండచిలువ...

-కేబీఆర్ పార్క్‌లో 20 అడుగుల కొండచిలువ ప్రత్యక్షం -వాకింగ్ ట్రాక్ దాటుతుండగా చూసి ఆశ్చర్యపోయిన వాకర్లు -సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన కొండచిలువ వీడియో



## బండి సంజయ్, ఈటల మధ్య కుదిరిన సయోధ్య

**తెలంగాణ పత్రిక :** తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. **మిగతా2లో**

# తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలపై ఉక్కుపాదం..

తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది.

# 'ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క'..

తెలంగాణలో ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఉద్యోగ 'నోటిఫికేషన్ల' స్థానంలో 'లూటిఫికేషన్లు' చేస్తున్నారని విమర్శించా రు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ' సదస్సులో మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "రేవంత్ గుర్తు పెట్టుకో.. నీ క్లైమాక్స్ హిట్లర్ కంటే దారుణంగా ఉంటుంది" అని హెచ్చరించారు. "ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క. కాంగ్రెస్ ప్రభుత్వానికి యువతే తగిన గుణపాఠం చెబుతుంది. ప్రజలు, నిరుద్యోగ యువత ఈ అవమానాలను ఎప్పటికీ మర్చిపోరు" అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రపంచంలోనే అతిపెద్ద మోసమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అశోక్‌నగర్‌లో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఉద్యోగాల క్యాలెండర్‌ను పక్కనపెట్టి జేబులు నింపుకోవడంపైనే దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు 70 వేల ఉద్యోగాలు నిజంగానే ఇచ్చి ఉంటే.. అందుకు సంబంధించిన నోటిఫికేషన్లతో సహా నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అలా నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొని రాహుల్ గాంధీకి జై కొడతానని ప్రకటించారు. ఈ సభ కాంగ్రెస్ చేసిన 'మహాద్రోహాన్ని' యువతకు గుర్తు చేసేందుకేనని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతపై పోలీసులు దాడులు చేయడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. యువత ఆకాంక్షలను అర్థం చేసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో జారీ చేసిన నోటిఫికేషన్లకే ఇప్పుడు నియామక పత్రాలు ఇచ్చి రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. ఒక మంత్రి ఒక మాట, మరో మంత్రి మరో మాట చెబుతూ ఉద్యోగాల విషయంలో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో భూములు, ఇసుక లూటీ జరుగుతోందని, ప్రజలు హామీల గురించి ప్రశ్నిస్తే వారిని అవమానిస్తున్నారని విమర్శించారు.

# తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం సక్సెస్


భారత అంతరిక్ష రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశీయ ప్రైవేట్ స్పేస్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'విక్రమ్-1' ఆర్బిటాల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో వాణిజ్యపరంగా సొంతంగా ఆర్బిటాల్ రాకెట్లను అభివృద్ధి చేసి, ప్రయోగించిన అతికొన్ని దేశాల సరసన భారత్ నిలిచింది.

'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ రాకను సూచిస్తుంది. తొలుత ఒక అంతర్గత సాంకేతిక సమస్య కారణంగా కొద్దిసేపు నిలిపివేసినా, ఆ తర్వాత రాకెట్ ప్రణాళిక ప్రకారమే నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లింది. రాకెట్‌కు సంబంధించిన నాలుగు దశలు అనుకున్నట్టుగానే పనిచేయడమే కాకుండా ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా తొలి ప్రయత్నంలోనే విజయవంతమైంది. ఈ చారిత్రక విజయం స్కైరూట్ బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

**'విక్రమ్-1' ప్రత్యేకతలు**

దాదాపు ఏడు అంతస్తుల ఎత్తు ఉండే విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా కార్బన్ కాంపోజిట్ మెటీరియల్‌తో నిర్మించారు. ఇది 350 కిలోల బరువున్న పేలోడ్లను భూమికి సమీపంలోని కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి మోసుకెళ్లగలదు. ఈ రాకెట్‌లో ఉపయోగించిన ప్రొపల్షన్ సిస్టమ్స్, అధునాతన 3డి-ప్రింటెడ్ ఇంజన్లు, హై-పెర్ఫార్మెన్స్ సాలిడ్ రాకెట్ మోటార్లు వంటి కీలక భాగాలన్నింటినీ స్కైరూట్ సంస్థే స్వయంగా అభివృద్ధి చేసింది.

ఈ తొలి ప్రయోగంలో గ్రాహ్ స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ వంటి సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు, స్కైరూట్‌కు చెందిన 'స్కోప్' ప్రయోగాన్ని కూడా పంపించారు. వీటితో పాటు కొన్ని ప్రత్యేకమైన వస్తువులను కూడా అంతరిక్షంలోకి పంపారు. వాటిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వదస్తూరితో రాసిన 'వందేమాతరం' పోస్ట్‌కార్డ్, ఇస్రో ప్రస్తుత, మాజీ చైర్మన్లు, భారత వ్యోమగాములు, స్కైరూట్ ఉద్యోగులు, పెట్టుబడిదారులు రాసిన సందేశాలు ఉన్నాయి.



ఈ విజయం కేవలం రాకెట్ పనితీరును నిర్ధారించడానికే పరిమితం కాదు. అంతరిక్ష రంగంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ సంస్థలకు కూడా తలుపులు తెరుస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ఇది ఒక పెద్ద విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా లభించిన కీలకమైన ఇంజినీరింగ్ డేటా, భవిష్యత్తులో విక్రమ్ సిరీస్ రాకెట్లను మరింత మెరుగుపరచడానికి, క్రమం తప్పకుండా వాణిజ్య ప్రయోగాలు చేపట్టడానికి స్కైరూట్‌కు సహాయపడుతుంది.

# రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

## తెలంగాణలో స్మార్ట్ రేషన్ కార్డులు..

కొత్త రేషన్‌కార్డుల తయారీ ఖర్చు మొత్తాన్ని పౌర సరఫరాల శాఖనే భరిస్తుందని, కార్డుదారులపై ఎలాంటి ఆర్థిక..కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధమవుతోంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్లకు పైగా కుటుంబాల కోసం క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన రేషన్ కార్డుల ముద్రణ ఇప్పటికే పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ కొత్త కార్డులను ఆయా జిల్లాలకు సైతం అధికార యంత్రాంగం చేరవేసింది. కార్డుల పంపిణీ తేదీని సీఎం రేవంత్ రెడ్డి ఖరారు చేయడమే ఆలస్యం. వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు అధికారులు. సీఎం ఖరారు చేసిన తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ వర్గాలు చెబుతున్నాయి

**స్మార్ట్ కార్డులు అంటే ఏమిటి?**

ఇప్పుడు రాష్ట్రంలో అందించే కొత్త రేషన్ స్మార్ట్ కార్డులు క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఉంటాయి. ఫొటోపై కార్డు యజమాని పేరు, చిరునామాలు ఉంటాయి. సీఎం రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలను కార్డుపై ముద్రించినట్లు సమాచారం. ప్రస్తుతం రేషన్ కార్డులు కాగితం రూపంలో ఉన్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇలా స్మార్ట్ కార్డు రూపంలో అందించడం మొదటిసారి. కార్డుపై క్యూఆర్ కోడ్ ప్రింటింగ్ చేసి ఉంటుంది. ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే రేషన్ లబ్ధిదారులైన ఆ కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఇప్పటి వరకు బియ్యం, చక్కెర, గోధుమలు వంటి రేషన్ వస్తువుల్ని తీసుకున్న పూర్తి వివరాలు కనిపిస్తాయి.

## హైదరాబాద్ కేబీఆర్ పార్కులో భారీ కొండచిలువ...

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్‌లో శనివారం ఉదయం ఓ భారీ కొండచిలువ ప్రత్యక్షమవ్వడం కలకలం రేపింది. సుమారు 20 అడుగుల పొడవున్న ఈ 'ఇండియన్ రాక్ పైథన్' పార్క్‌లోని వాకింగ్ ట్రాక్‌ను నెమ్మదిగా దాటుతుండగా చూసిన మార్నింగ్ వాకర్లు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కొందరు ఈ దృశ్యాన్ని తమ ఫోన్లలో చిత్రీకరించగా, ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనతో వాకర్లు కొద్దిసేపు నిలిచిపోయి, సురక్షిత దూరం నుంచి ఆ కొండచిలువను గమనించారు. అయితే, ఎవరికీ ఎటువంటి హాని తలపెట్టకుండా అది నెమ్మదిగా సమీపంలోని పొదల్లోకి వెళ్లిపోయింది. కాగా, వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972లోని షెడ్యూల్-1 ప్రకారం 'ఇండియన్ రాక్ పైథన్' అత్యంత రక్షిత జాతుల జాబితాలో ఉంది. ఇటీవల హైదరాబాద్ నగరంలో పాముల సంచారం గణనీయంగా పెరిగిందని, వాతావరణ మార్పుల కారణంగానే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్' వంటి స్వచ్ఛంద సంస్థలు పేర్కొంటున్నాయి. వన్యప్రాణులు ఎక్కడైనా కనిపిస్తే వాటికి దూరంగా ఉండాలని, వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

## నా కుటుంబానికి పెద్దన్న అందెశ్రీ

అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు.

## బండి సంజయ్, ఈటల మధ్య కుదిరిన సయోధ్య

తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఆయిల్ పామ్ రైతుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలి

హైదరాబాద్, జులై 18: కేంద్రంపై సంయుక్త ఒత్తిడికి దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఆయిల్ పామ్ రైతుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలని కోరారు. ప్రధాని మోదీని కలిసి ఆయిల్ పామ్ రైతుల సమస్యలు వినిపిద్దామన్నారు. ఆయిల్ పామ్‌కు కనీస హామీ ధర రూ.25 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేదంటే క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలన్నారు. దిగుమతి సుంకాల తగ్గింపుతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోందని మంత్రి తెలిపారు. దేశ ఆయిల్ పామ్ సాగులో 75 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదే అని చెప్పుకొచ్చారు. రైతులకు స్థిర ఆదాయం కోసం కేంద్రం తక్షణ జోక్యం అవసరమన్నారు. వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్యానికి రైతుల రక్షణ కీలకమన్నారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం దక్షిణాది రాష్ట్రాలు కలిసిరావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

## 72వ జాతీయ అవార్డులు

భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం న్యూఢిల్లీలో ప్రకటించింది. 2024 సంవత్సరానికి గాను ప్రకటించిన ఈ అవార్డులలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి మరోసారి తన నటనతో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. 'భ్రమయుగం' చిత్రంలో ప్రదర్శించిన అద్భుత నటనకు గాను ఆయన ఉత్తమ నటుడిగా నిలిచారు. ఆయనతో పాటు 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తీక్ ఆర్యన్ కూడా ఈ పురస్కారాన్ని సంయుక్తంగా గెలుచుకున్నారు. ఉత్తమ నటిగా బాలీవుడ్ భామ యామీ గౌతమ్ (ఆర్టికల్ 370) ఎంపికయ్యారు. అదే సమయంలో, చిన్న సినిమాగా విడుదలై విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికై తెలుగు సినిమా గౌరవాన్ని ఇనుమడింపజేసింది. ఈ ఏడాది అవార్డులలో కంటెంట్ ఆధారిత చిత్రాలతో పాటు కమర్షియల్ చిత్రాలు కూడా సత్తా చాటాయి. బాలీవుడ్ చిత్రం 'ఆర్టికల్ 370' ఏకంగా మూడు ప్రధాన పురస్కారాలను కైవసం చేసుకుంది. ఈ చిత్రం ఉత్తమ చిత్రంగా నిలవడమే కాకుండా, ఇందులో అద్భుత నటన కనబరిచిన యామీ గౌతమ్‌ను ఉత్తమ నటి పురస్కారం వరించింది. ఇదే చిత్రానికి శశ్వత్ సచ్‌దేవ్ ఉత్తమ సంగీత దర్శకుడిగా ఎంపికయ్యారు. ప్రధాన పురస్కారాల విజేతలు: ఉత్తమ చిత్రం: ఆర్టికల్ 370 ఉత్తమ నటులు: మమ్ముట్టి (భ్రమయుగం), కార్తీక్ ఆర్యన్ (చందు ఛాంపియన్) ఉత్తమ నటి: యామీ గౌతమ్ (ఆర్టికల్ 370) ఉత్తమ దర్శకుడు: రాజ్‌కుమార్ పెరియసామి (అమరన్) ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: కల్కి 2898 ఏడీ తెలుగు సినిమాకు అవార్డుల పంట ఈసారి జాతీయ అవార్డులలో తెలుగు చిత్ర పరిశ్రమ పలు విభాగాల్లో తనదైన ముద్ర వేసింది. 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తెలుగు చిత్రంగా నిలవడమే కాకుండా, ఈ చిత్రానికి పనిచేసిన పి. రవికుమార్‌కు ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ అవార్డు లభించడం విశేషం. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో విడుదలై విజయం సాధించిన 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా ఎంపికైంది. దీంతో పాటు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ (నితిన్ జిహానీ చౌదరి) అవార్డును కూడా గెలుచుకుంది.

తెలంగాణ పత్రిక

ఆదివారం
జూలై 19 2026
కరీంనగర్



# వనదుర్గమ్మను దర్శించుకున్న సినీ నటుడు మంచు విష్ణు

-పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికిన ఆలయ అర్చకులు, సిబ్బంది

-ఆలయ విశిష్టతను వివరించిన అడిషనల్ కలెక్టర్ నగేష్

పాపన్నపేట, జూలై 18:(తెలంగాణ పత్రిక)






దేశంలోనే రెండో వన దుర్గామాత ఆలయంగా.. మంజీరా ఏడుపాయలుగా చీలి ప్రవహించే ప్రసిద్ధ ప్రాంతంగా.. జనమేజయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వన దుర్గామాతను ప్రముఖ సినీ నటుడు మంచు విష్ణు శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, సిబ్బంది, మెదక్ అడిషనల్ కలెక్టర్ నగేష్ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో ఆలయ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. అడిషనల్ కలెక్టర్ నగేష్ ఆలయ విశిష్టతను మంచు విష్ణుకు వివరించారు. ఆయన వెంట దేవస్థానం సిబ్బంది, టూరిజం శాఖ సిబ్బంది, స్థానిక పోలీసులు తదితరులు ఉన్నారు.

# ఏజెన్సీ చట్టాల అమలులో అధికారుల నిర్లక్ష్యం... జీపీస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి

-ఫిర్యాదులు చేసిన పట్టించుకోని మండల రెవెన్యూ అధికారి...

-అక్రమార్కులకు రెవిన్యూ అధికారుల అండ...

వాజేడ తెలంగాణ పత్రిక జూలై 18.



ఏజెన్సీ చట్టాలు అమలు చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వాజేడు మండల కేంద్రంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు పద్దం సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి హాజరై మాట్లాడారు. వాజేడు మండలంలో ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా గిరిజనేతరులు ఆదివాసుల భూ ఆక్రమణలు ఎన్నో జరుగుతున్నాయని, మండల రెవిన్యూ అధికారి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సంఘాల ఆధ్వర్యంలో అనేకమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు నిర్లక్ష్య ధోరణ చేస్తున్నారని అన్నారు.గిరిజనేతర్ల అక్రమాలకు అధికారుల అండదండలు ఉన్నాయని తేల్చిచెప్పారు.వలస గిరిజ నేతరులు ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమంగా చొరబడి ఆదివాసి భూములను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని, అదే క్రమంలో మండల రెవెన్యూ అధికారి నయాబ్ తాసిల్దార్ కి ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. 1/70 చట్టానికి విరుద్ధంగా జరుగుతున్న భూముల క్రయవిక్రయాలు ఆపాలని సాయి డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీస్పీ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్,మండల కార్యదర్శి కారం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# యువ సంగ్రామ సభకు కుత్బుల్లాపూర్ భారీగా బీఆర్ఎస్ శ్రేణులు

తెలంగాణ పత్రిక, కుత్బుల్లాపూర్, జూలై 18:



సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంగ్రామ సభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు తరలివెళ్లారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పి. వివేకానంద, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నాయకత్వంలో సుమారు 2,000 మంది శ్రేణులు 50 బస్సులు, 350 కార్లలో సభకు చేరుకున్నారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన యువ సంగ్రామ సభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన "యూత్ డిక్లరేషన్" అమలుకాక యువతకు నిరాశ మిగిల్చిందని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, పారదర్శక నియామకాలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. యువత గొంతును అణిచివేయాలనే ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తోందని, తెలంగాణ యువత ఆకాంక్షలకు అండగా నిలవడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే యువ సంగ్రామ సభ లక్ష్యమని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నుంచి భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులకు ఎమ్మెల్యే కె.పి. వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అభినందనలు తెలిపారు. తెలంగాణ యువత హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ప్రతిపక్ష గొంతు నొక్కే ప్రయత్నం: శంభీపూర్ రాజు

తెలంగాణ పత్రిక, హైదరాబాద్, జూలై 18:



బీఆర్ఎస్ నిర్వహిస్తున్న యువ సంగ్రామ సభకు హైకోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ, పార్టీ నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు శంభీపూర్ రాజు విమర్శించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌ను సభకు వెళ్లకుండా అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన యువ సంగ్రామ సభ నేపథ్యంలో విడుదల చేసిన ప్రకటనలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సభ నిర్వహణకు తొలుత అనుమతి నిరాకరించినప్పటికీ, గౌరవ హైకోర్టు అనుమతితో కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో కూడా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. హైకోర్టు అనుమతి ఇచ్చిన తర్వాత కూడా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌ను సభకు వెళ్లకుండా అడ్డుకోవడం రాజ్యాంగ విలువలను దెబ్బతీసే చర్య అని అన్నారు. న్యాయస్థానాల ఆదేశాలను అమలు చేయాల్సిన ప్రభుత్వమే వాటి స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా సభలు, సమావేశాలు నిర్వహించుకోవడం ప్రతి రాజకీయ పార్టీకి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఆ హక్కును పోలీసులు కాలరాయడం సమంజసం కాదన్నారు. యువత సమస్యలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న సభకు ప్రభుత్వం భయపడుతోందని, ప్రతిపక్ష గొంతును అణిచివేసేందుకు పోలీసులను వినియోగిస్తోందని ఆరోపించారు. హైకోర్టు అనుమతి ఉన్నప్పటికీ నాయకులను నిర్బంధించిన ఘటనపై ప్రభుత్వం వెంటనే వివరణ ఇవ్వాలని, హౌస్ అరెస్ట్ చేసిన నాయకులను తక్షణమే విడుదల చేసి భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని శంభీపూర్ రాజు డిమాండ్ చేశారు.

# ఈపీఎఫ్ పింఛన్ బీడీ కార్మికుల కష్టాలు తీర్చాలి

-పార్లమెంట్ సమావేశాల్లో ఈపీఎఫ్ పింఛన్ పెంపుపై బిల్లు తీసుకురావాలి

-బీజేపీ నాయకుడు వెలిదే సదానందం (బద్దం బాల్ రెడ్డి)

ఆత్మకూరు, జూలై 18 (తెలంగాణ పత్రిక):

బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక, ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం వారి ఈపీఎఫ్ పింఛన్‌ను గణనీయంగా పెంచేలా చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకుడు వెలిదే సదానందం కోరారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బీడీ కార్మికుల ఈపీఎఫ్ పింఛన్ పెంపునకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల్లో వేలాది మంది బీడీ కార్మికులు ఈపీఎఫ్ పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అందుతున్న పింఛన్‌తో నిత్యావసర ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి నెలకొందని, పెరుగుతున్న ధరల నేపథ్యంలో వృద్ధాప్యంలో ఉన్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పొగాకు ఆకులు, పొగాకు ధూళితో పనిచేయడం వల్ల బీడీ కార్మికులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. చికిత్సకు భారీగా ఖర్చు చేయాల్సి రావడంతో కుటుంబాలు అప్పుల పాలై ఆర్థికంగా కుదేలవుతున్నాయని, కొంతమంది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి దయనీయ స్థితికి చేరుకున్నాయని అన్నారు.బీడీ కార్మికుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కనీస ఈపీఎఫ్ పింఛన్‌ను రూ.5,000కు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈపీఎఫ్ పింఛన్ పెంపుపై సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని అమలు చేస్తూ పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింపజేయాలని కోరారు. అలాగే, బీడీ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణకు చెందిన అన్ని రాజకీయ పార్టీల ఎంపీలు పార్టీ భేదాలకు అతీతంగా పార్లమెంట్‌లో ఈ అంశానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీడీ కార్మికుల పట్ల మానవతా దృక్పథంతో స్పందించి, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. బీడీ కార్మికులు దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతోకాలం సేవలందించిన శ్రామికులని, వారి వృద్ధాప్య జీవితం గౌరవప్రదంగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈపీఎఫ్ పింఛన్ పెంపుతో పాటు సంక్షేమ చర్యలు చేపట్టాలని వెలిదే సదానందం విజ్ఞప్తి చేశారు.

# యూరియా కొరత,కరెంటు కోత కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి




జగిత్యాల రూరల్ (తెలంగాణ పత్రిక) జూలై 18

ఈరోజు రేచపల్లి లో దావ వసంత సురేష్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ జగన్నాథ స్వామి ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేసి,రైతు బొమ్మ సాక్షిగా, పూర్తి స్థాయి రైతు ఆధారిత గ్రామం రేచపల్లి,ఆ జగన్నాథుడి కృప ప్రజలు అందరిపై ఉండాలని అన్నారు.రైతే రాజు అన్న సీఎం మాటలు నీటి మూటలు అయ్యాయి,యూరియా కొరత, కరెంటు కోత,కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి అన్నారు.షాప్ లో లేని యూరియా,ఆప్ లో ఎలా దొరుకుద్ది అని అన్నారు. యూరియా ధరలు కంట్రోల్ చేయలేని దద్దమ్మ సీఎం అని అన్నారు.కాళేశ్వరం నీళ్లు విడుదల చేసి రైతు గోస తీర్చకపోతే రైతు బొమ్మ సాక్షిగా మరో యుద్ధం తప్పదు అని హెచ్చరించారు.ఆంధ్ర మూలాలు ఉన్న సీఎం కు తెలంగాణ పైన ప్రేమ ఎలా ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామస్తులు,కార్యకర్తలు, నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కోటగిరిలో సీఎం చెక్కులు పంపిణీ

-మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్ ఆధ్వర్యంలో.



కోటగిరి తెలంగాణ పత్రిక 18.

కోటగిరి మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్ స్వగృహంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్ కలిసి ముఖ్యమంత్రి సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులు మంజూరు కవడంతో యాద్గార్ పూర్ గ్రామంలో 2, ఏక్లాస్ పూర్ 1, జల్లపల్లి ఫారం 1, నలుగురి లబ్ధిదారులకు కలసి ఒక్క లక్ష యాభై ఐదు వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ... అనారోగ్యంతో ఉన్నప్పుడు ఆసుపత్రిలో వైద్యం చేసుకుని ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆసుపత్రి బిల్లులను సమర్పించిన కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయాలని కోరడంతో వారికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులను మంజూరు చేయడం జరిగిందన్నారు. సీఎం చెక్కుల లబ్ధిదారులు తరపున కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తరపున సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞత ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మిర్జాపూర్ చిన్న సాయన్న అబ్దుల్లా దాదు మున్వర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ లో ఘనంగా మాజీ మంత్రి జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

-కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు

మిర్యాలగూడ ప్రతినిధి//జూలై 18:(తెలంగాణ పత్రిక):-



మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జగదీష్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర మరియు ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలు మరింత కొనసాగాలని, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు కలిగి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి, దుర్గంపూడి నారాయణ రెడ్డి, ఎండి.యూసుఫ్, జొన్నలగడ్డ రంగా రెడ్డి, ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, ఎండి.మగ్దూం పాషా, అంగోతు హాతిరాం నాయక్, మట్టపల్లి సైదులు యాదవ్, చౌగాని బిక్షం గౌడ్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, చిర్ర మల్లయ్య యాదవ్, అమరావతి సైదులు, వేలిచేటి రామకృష్ణ, బంటు శ్రీనివాస్, పాశం నరసింహ రెడ్డి, పెండ్యాల పద్మ,షహనాజ్ బేగం, దైద సత్యం, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జీలు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జగదీష్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త పాటించాలి వైద్యాధికారి తరుణ్

ఆళ్లపల్లి జూలై 18(తెలంగాణ పత్రిక)

వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల దగ్గు, జలుబు, జ్వరం, డెంగ్యూ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పడాలని పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత జాగ్రత్తలు, మరియు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చాలా ముఖ్యమని శనివారం వైద్యాధికారి తరుణ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్యశాలకు 20 కిలోమీటర్ల లోపులో ఆదివాసి గిరిజన గ్రామాలు ఉంటాయి కనుక ఈ వర్షాకాలం సీజన్లో దోమలు ఎక్కువగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీటి కుండీలు, కూలర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని రాత్రి పూట తప్పనిసరిగా దోమతెరలు వాడాలని పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని వారన్నారు. జ్వరము దగ్గు జలుబు ఏమైనా ఉంటే తక్షణమే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని అన్నారు.

# దమ్మపేట ఏజెన్సీ నకిలీ భూ దస్త్రాల కుంభకోణం: జీపీవో సస్పెన్షన్

-తహసీల్దార్‌పై క్రమశిక్షణా చర్యలకు కలెక్టర్ ఆదేశం




దమ్మపేట తెలంగాణ పత్రిక జూలై 18

దమ్మపేట ఏజెన్సీలో వెలుగుచూసిన నకిలీ భూ దస్త్రాల కుంభకోణంపై జిల్లా యంత్రాంగం తొలి కఠిన చర్యలు చేపట్టింది. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పెద్దగొల్లగూడెం గ్రామ పంచాయతీ అధికారిణి (జీపీవో) అనంతమ్మను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అదే వ్యవహారంలో తహసీల్దార్ రామ్ నరేష్ పాత్రపై కూడా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో, ఆయనపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిణామంతో రెవెన్యూ శాఖలో తీవ్ర కలకలం రేగింది. నకిలీ భూ పత్రాల వ్యవహారంలో మరికొందరు అధికారులు, సిబ్బంది పాత్రపై కూడా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లా యంత్రాంగం తీసుకున్న ఈ చర్యలు ఏజెన్సీ ప్రాంతంలో భూ అక్రమాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా మారాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన బిజెపి నాయకులు

-ఇటీవల ప్రమాదం జరిగి ఇద్దరికీ తీవ్ర గాయాలు
-అధికారుల లోపం వల్లే తరచుగా ప్రమాదాలు
-బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి
-ఫ్యాక్టరీలో ఒక అంబులెన్స్ ఏర్పాటు చేయాలి




తెలంగాణ పత్రిక దమ్మపేట జూలై 18

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన బిజెపి నాయకులు తంబళ్ల రవి,ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించి,అది ఎలా జరిగిందనే వివరాలను అక్కడ ఉన్న మేనేజర్,సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు,వారు మాట్లాడుతూ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని,ప్యాక్టరీ యాజమాన్యం బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలి అని ఫ్యాక్టరీలో కార్మికుల భద్రతకు కచ్చితమైన చర్యలు తీసుకోవాలని,ఇక్కడ ఏ ప్రమాదం జరిగిన ఆ విషయాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచుతున్నారని,ప్రవేట్ వాహనంలో పేసెంట్లను సత్తుపల్లి ప్రవేట్ హాస్పిటల్ కి తరలించడంలో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని,తరచుగా ఫ్యాక్టరీలో ప్రమాదాలు జరుగుతున్నవి ఉన్నత స్థాయి అధికారులు ఫ్యాక్టరీ సందర్శించి లోపాలు ఎక్కడున్నాయో కనిపెట్టాలని,కార్మికుల భద్రత కోసం ఒక అంబులెన్స్ ఏర్పాటు చేయాలనీ బిజెపి పార్టీ తరఫున డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దారా నాగేశ్వరావు,గూడా ముత్యాలరావు,పూచి ప్రసాద్, శ్రీనివాసరావు,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య అందాలంటే తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సహకారంతోనే

-ప్రతి నెల పేరెంట్స్ మీటింగ్ కి హాజరు కావాలి
-మర్కోడు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ హెడ్ మాస్టర్ బాబూలాల్

ఆళ్లపల్లి జూలై 18(తెలంగాణ పత్రిక)

మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పేరెంట్స్ మీటింగ్ జరిగింది.ఈ సందర్భంగా హెడ్మాస్టర్ బాబూలాల్ మాట్లాడుతూ,విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిరోజు 9 గంటలకు పంపించే ఏర్పాటు చేయాలని తెలిపారు. స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థులు మంచి విద్య నేర్చుకోవడం జరుగుతుందని,ప్రతి విద్యార్థికి మంచి విద్య బోధన అందించడమే మా ముందున్న ప్రణాళికని,దీనికి తల్లిదండ్రుల సహకారం ఎంతైనా అవసరం ఉందని తెలిపారు,స్కూల్ టైం అయిపోయిన తర్వాత విద్యార్థులు ఇంటికి వచ్చినప్పుడు వారి తల్లిదండ్రులు చదువు కొరకు కొంచెం చొరవ చూపాలని తెలిపారు,ఇంటికి వచ్చిన వారి పిల్లలకు చదువుతోపాటు బాధ్యతలు కూడా నేర్పాలని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ స్కూల్లో విద్యార్థులకు సరైన యూనిఫాంలు ఉండేటట్లు చూడాలని, పిల్లలకు యోగ ఆటలు ఆడించే పిటి సారు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు, దీనిని జిల్లా ఉన్నతాధికారులు ఎంఈఓ దీనిపై చొరవ చూపి హై స్కూల్లో వెంటనే పి టి సార్ ని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా లో తాడిచర్ల--2 బ్లాక్ సాధన విజయోత్సవాలు ఘనంగా నిర్వహణ

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూలై 18





తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడం సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాల సందర్భంగా కొత్తగూడెం ఏరియా లో గల అన్నీ మైన్స్ / డిపార్ట్మెంట్ లలో (శనివారం) న ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేమ్ రాజు ముఖ్య అతిథిగా హాజరై సింగరేణి ఉద్యోగులకు అభినందించారు. ఈ సందర్భంగా జియం ఎం. షాలేమ్ రాజు మాట్లాడుతూ, తాడిచర్ల-2 బ్లాక్ సాధన సింగరేణి సంస్థ భవిష్యత్తుకు ఎంతో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని జియం పేర్కొన్నారు. ఈ విజయోత్సవం మన సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ప్రతి ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం అన్ని గనులు డిపార్ట్మెంట్ లలో తాడిచర్ల--2 బ్లాక్ కేటాయింపు విజయోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ స్వీట్లు పంపిణీ చేసి తాడిచర్ల-2 బ్లాక్ సాధన పట్ల తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందేశంతో కూడిన కరపత్రాలను ఉద్యోగులందరికీ పంపిణీ చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తూ, తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధనతో సింగరేణి సంస్థకు సుస్థిర భవిష్యత్తు లభించిందని, సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమం, కొత్త బొగ్గు గనుల సాధన, ఉత్పత్తి వ్యయ నియంత్రణ, సాంకేతిక అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగంలో విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్యోగులకు వివరించారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఒకరికి ఒకరు స్వీట్లు, మిఠాయిలు తినిపించుకుంటూ వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. అన్ని గనులు విభాగాలలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడము జరిగినది. ఏరియా జీఎం ఎం. షాలేమ్ రాజు వికెసీఎం జీఎం కార్యలయం నందు నిర్వహించిన కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలెమ్ రాజు వికెసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవి. నరసింహారావు, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు , ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ఎస్వోటు జీఎం ఎం గోవిందరావు పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి ఏరియా ఇంజినీర్ వి రామకృష్ణ ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు , డిజిఎం (ఐఈడి) యోహాన్ , ఇన్‌చార్జ్ హెచ్ ఓ డి (సివిల్) కె. రాజారాం డివైపిఎం హరీష్ , ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య , ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ సౌజన్య, ఐఎన్టియుసి ఫిట్ సెక్రటరీ సాగర్ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సూపర్వైజర్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల ప్రగతి





-రానున్న ఆరు నెలల్లో పాఠశాలల మౌలిక వసతుల పనులు పూర్తి
-ప్రతి తల్లిదండ్రులు పేరెంట
--టీచర్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలి
-తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ప్రతినిధి జూలై-18 ( తెలంగాణ పత్రిక )

విద్యార్థుల విద్యా ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ప్రతిభ కనబరుస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం పెద్దపల్లి మండలంలోని తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని పాఠశాలలో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, తల్లిదండ్రుల బాధ్యతలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయిందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన మౌలిక వసతుల పనులన్నింటినీ రానున్న ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ లక్ష్యం సాధించడంలో తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని, ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పేరెంట్--టీచర్ సమావేశాలకు హాజరై తమ పిల్లల చదువు, ప్రగతి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని కలెక్టర్ తెలిపారు. ఏదైనా కారణంతో కొద్ది రోజులు పాఠశాలకు రాలేకపోతే వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని, తద్వారా వారు మిస్సైన పాఠాలను ప్రత్యేకంగా బోధించే అవకాశం ఉంటుందన్నారు.ప్రతి రోజు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత కొంత సమయం పిల్లలతో గడపాలని, పాఠశాలలో ఏమి నేర్చుకున్నారో, హోంవర్క్ ఇచ్చారా అని అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ హోంవర్క్ పూర్తి చేసేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కోరారు.తల్లిదండ్రులు ఎప్పుడైనా పాఠశాలకు వచ్చి తమ పిల్లవిద్యా పురోగతి, ప్రవర్తన గురించి ఉపాధ్యాయులను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లా యంత్రాంగం సమిష్టిగా పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సంపూర్ణ సహకారం లభిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తారని జిల్లా కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ. శారద, జి.సి.డి.ఓ. కవిత, సర్పంచ్ రాజయ్య, ఉప సర్పంచ్ తిరుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజు లత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ,తదితరులు, పాల్గొన్నారు.

# కేజీబీవి కొత్త హంగులు : విద్యార్థునులకు మెరుగైన వసతులు

-అదనపు తరగతి గదులు-మౌలిక సదుపాయాలు ప్రారంభం:

తానూర్: 18జూలై (తెలంగాణ పత్రిక)



నాబార్డ్ నిధులతో తానూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.56 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులు, రూ.42.12 లక్షలతో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను ,ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుతో విద్యార్థినులకు మరింత సౌకర్యవంతమైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, ఎమ్మార్వో మహేందర్ నాథ్, సర్పంచ్ సుగంధ మాధవరావు పాటిల్ ,మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్ రావ్ పాటిల్, ఎంఈఓ నరేందర్, ప్రధాన ఉపాధ్యాయురాలు అలేఖ్య, ఉపాధ్యాయులు, విద్యాలయ సిబ్బంది, ఉప సర్పంచ్ ఫారుక్, కార్యదర్శి, వార్డ్ మెంబర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, శివాజీ పాటిల్, చంద్రకాంత్, దేవిదాస్ ,సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలులో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి




**-పెండింగ్ సంక్షేమ నిధుల పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలి**

**-గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండరాదు**

**-ఐడీఓసీలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

పెద్దపల్లి, ప్రతినిధి జూలై-18 ( తెలంగాణ పత్రిక )

ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యఅన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు బి. శ్రీరాములు,జె. అరుణ శ్రీలతో కలిసి జిల్లా అధికారులతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. అలాగే గురుకులాలు, సంక్షేమ, గిరిజన రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, మోడల్ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల పై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ,ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారానికి సంబంధించిన 50 శాతం నిధులను విడుదల చేయించినట్లు తెలిపారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఓవర్సీస్ విద్యా పథకం, ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారం, గురుకుల విద్యాసంస్థలకు సంబంధించిన పెండింగ్ నిధులు ఎంత ఉన్నాయో పూర్తి వివరాలను వెంటనే కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రితో సమావేశం నిర్వహించనున్నందున, పెండింగ్‌లో ఉన్న అన్ని నిధుల విడుదల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి, మిగిలిన నిధులన్నింటినీ విడుదల చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా లేకుండా పూర్తి విద్యార్థి సామర్థ్యంతో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ,ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్లను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ఉపాధి కల్పనలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని, ఉపాధి కల్పన కార్యాలయం, వారధి సొసైటీ ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసే అన్ని ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రిజర్వేషన్ విధానాన్ని పారదర్శకంగా అమలు చేసి, అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంకింద ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి, నిబంధనల ప్రకారం సత్వర విచారణ నిర్వహించి ఛార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిజమైన బాధితులకు చట్టబద్ధంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, సంక్షేమ పథకాల అమలులో జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షమాట్లాడుతూ,** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కమిషన్ సూచించిన మేరకు పెండింగ్ నిధులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి నిర్ణీత సమయంలో కమిషన్‌కు సమర్పిస్తామని తెలిపారు. విద్య, ఉపాధి, సంక్షేమం, జీవనోపాధి, గురుకుల విద్యాసంస్థల బలోపేతం, ఎస్సీ, ఎస్టీ వర్గాల సమగ్ర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు,కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్, ఆర్డీవోలు,బి.గంగయ్య, సురేష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్, ఏసిపి రమేష్ ,వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.









# నీటి నిల్వ సమస్యలపై క్షేత్రస్థాయిలో సీపీ పరిశీలన

**-వర్షాకాలంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు**

**-సంబంధిత శాఖలతో సమన్వయం పెంచాలని ఆదేశం**

తెలంగాణ పత్రిక, హైదరాబాద్, జూలై 18:



వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లలో వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను ఆయన శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తుతున్న ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టే దిశగా సైబరాబాద్ పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్ల జోనల్ కమిషనర్లు, ట్రాఫిక్ డీసీపీ, అదనపు డీసీపీలు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఎలక్షన్ బిల్డింగ్, పిస్తా హౌస్ పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆయా ప్రాంతాల్లో నీరు నిల్వ కావడానికి గల కారణాలను అధికారులు విశ్లేషించారు. వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లేలా ప్రస్తుత డ్రైనేజ్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరాన్ని గుర్తించారు. అలాగే నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన బాటిల్‌నెక్ ప్రాంతాలను తొలగించడం, కల్వర్టులు, స్టార్మ్ వాటర్ డ్రైన్లను విస్తరించడం, కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్, చెత్తను పూర్తిగా తొలగించడం, అవసరమైన చోట్ల అదనపు డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు కార్యాచరణతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. నీరు నిలిచే ప్రాంతాల్లో అత్యవసర స్పందన బృందాలు, మోటార్ పంపులు, జేసీబీలు, అవసరమైన యంత్రాలు, సిబ్బందిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు. వర్షం ప్రారంభమైన వెంటనే స్పందించి నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు, ఇరిగేషన్ శాఖ, ఇంజినీరింగ్ విభాగం, ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సీపీ పేర్కొన్నారు. ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, వర్షపు రోజుల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, వర్షాకాలంలో ట్రాఫిక్ సాఫీగా సాగేలా అన్ని శాఖలతో సమన్వయం కొనసాగిస్తూ అవసరమైన చర్యలను వేగంగా అమలు చేస్తామని అధికారులు తెలిపారు. నగరంలో నీటి నిల్వ సమస్యలను తగ్గించడంతో పాటు ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు సైబరాబాద్ పోలీసులు కట్టుబడి ఉన్నారని వెల్లడించారు.

# కామారెడ్డిలో టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్ విజయగాథల పుస్తకావిష్కరణ



కామారెడ్డి ,జులై 18,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

హైదరాబాద్‌లోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్లో శిక్షణ పొందిన విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో సాధించిన విజయాలను ప్రతిబింబించే "విజయగాథలు" పుస్తకాన్ని నేడు ఘనంగా ఆవిష్కరించారు. కామారెడ్డి జిల్లాకలెక్టర్ ఛాంబర్ లోఈ పుస్తకాన్ని ఆశిష్ షాంగ్వాన్, చేతుల మీదుగా ఆవిష్కరించగా, ఈ కార్యక్రమంలో విక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డిప్యూటీ కలెక్టర్ రవితేజ.పి. వెంకటేష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి , దేవిదాస్, డైరెక్టర్, నిజామాబాద్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ పాల్గొన్నారు. ఈ పుస్తకంలో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది వివిధ పోటీ పరీక్షల్లో విజయాలు సాధించిన అభ్యర్థుల స్ఫూర్తిదాయక విజయగాథలను పొందుపరిచారు. ఈ విజయగాథలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రేరణగా, మార్గదర్శకంగా నిలవడంతో పాటు, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ అందిస్తున్న నాణ్యమైన శిక్షణ, మార్గనిర్దేశం మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థుల అభివృద్ధికి సంస్థ చేస్తున్న విశేష కృషిని ప్రతిబింబిస్తున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆర్థిక సహాయం

**-కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు చీర అశోక్ ఆధ్వర్యంలో అందజేత**



గూడూరు మండల ప్రతినిధి:- జులై 18. (తెలంగాణ పత్రిక ప్రతినిధి):-

మహబూబాబాద్ జిల్లా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన గూడూరు మండల కేంద్రం పరిధిలోని పొనుగోడు గ్రామానికి చెందిన, కుర్మ సంఘం నాయకుడు పోతరాజు రవి కుర్మ. హాస్పిటల్ లో చికిత్స పొంది డిఛార్జ్ అయ్యి, స్వగృహానికి చేరుకున్న క్రమంలో, శనివారం కుర్మ సంఘం మానుకోట జిల్లా అధ్యక్షుడు చీర అశోక్ ఆధ్వర్యంలో గూడూరు, కేసముద్రం, కొత్తగూడ, మండలాల కుర్మ సంఘం నాయకులు వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించి, మనో ధైర్యాన్ని కల్పించారు. అనంతరం కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు చీర అశోక్ ఆధ్వర్యంలో 43,500 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు కుర్మ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కురుమ సంఘం జిల్లా నాయకులు మధుగిరి సాంబయ్య, కురుమ సంఘం మండల అధ్యక్షుడు మండల ఉపేందర్, జిల్లా నాయకులు కుండె కిషన్, మండల మల్లేష్, కెంచ వెంకన్న, అన్న వెంకన్న, గౌండ్ల యాదగిరి, కోరే ఐలయ్య, కోరి మల్లేష్, కుండే బీరయ్య, మంగ కుమార స్వామి, చీర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# 20న జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయలి

**-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్లు గౌతమ్ రెడ్డి**

మిర్యాలగూడ ప్రతినిధి//జులై 18:(తెలంగాణ పత్రిక):-



ఈనెల 20వ తేదీ భవనం నిర్మాణ కార్మికుల చలో కలెక్టర్ ధర్నాను విజయవంతం చేయాలని. మిర్యాలగూడ బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్. సిఐటియు అనుబంధం. పెయింటర్స్ ఆధ్వర్యంలో శనివారం కరపత్రం విడుదల. చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారికి కనీసం ఈఎస్ఐ సదుపాయం కూడా లేదని ప్రభుత్వం వీరి గురించి శ్రద్ధ తీసుకోవాలని కోరారు. భవనాలు నిర్మించే ఈ కార్మికులకు సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ చాలీచాలని జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మంద రాజు పెయింటింగ్ యూనియన్ అధ్యక్షులు ఎస్కే పాషా బాయ్ . కోశాధికారి పాశం గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి అంగరాజు రాంబాబు, పోకల ప్రసాదు బాబు, సామేలు సోములు. రామ్మూర్తి, శాంతమ్మ, కనకమ్మ, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పెరిక సంఘం జిల్లా అధ్యక్షునికి జన్మదిన వేడుకలు



కామారెడ్డి, జూలై 18,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడు, దోమకొండ సీనియర్ జర్నలిస్టు పిన్నం రాంచంద్రంకు మండల కాంగ్రెస్ నాయకులు శనివారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 55వ పుట్టిన రోజు సందర్భంగా ఆయన చేతుల మీదుగా మాజీ జెడ్పిటిసి తిరుమల్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆశ బోయిన శ్రీనివాస్ జన్మదిన కేకును కోయించారు. ఆయనకు కేకు తినిపించారు. మండల నాయకులు, కార్యకర్తలు సైతం కేకును తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అనంతరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సీతారాం మధు, తాటిపల్లి శ్రీకాంత్,ఏఎంసి డైరెక్టర్ గోపాల్ రెడ్డి, చాముండేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధారెడ్డి, అబ్రబోయిన రాజయ్య, ముత్తా గౌడ్, గొర్ల ప్రభాకర్,నిమ్మ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో హోటళ్లపై దాడులు నిర్వహించిన ఎన్ఫోర్స్మెంట్ అధికారులు



కామారెడ్డి, జులై 18,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ అధికారి ముకుంద రెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి మున్సిపాలిటీలోని హోటళ్లపై అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న సమాచారం మేరకు దాడులు నిర్వహించగా డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ ఎదురుగా గల లక్ష్మీ మెస్ నందు అనుమతి లేకుండా మద్యం తాగిపిస్తూ మెస్ నడుపుతున్నటువంటి వ్యక్తి లింబయోల దిలీప్ రెడ్డి పై కేసు నమోదు చేయడం జరిగింది. అదేవిధంగా కామారెడ్డి మున్సిపాలిటీ లోని హోటల్లో, మెస్ లలో, దాబాల యందు అనుమతి లేకుండా మద్యం విక్రయాలు జరిగినా మద్యం సేవించుటకు అనుమతించిన కేసులు నమోదు చేయబడతాయి అని ఎటువంటి సమాచారం ఉన్న మాకు తెలియజేయాలని ఎక్సైజ్ సిఐ సంపత్ కృష్ణ తెలిపారు ఈ దాడులలో సీఐ సంపత్ కృష్ణ , ఎస్సై విక్రంకుమార్, హెడ్ కానిస్టేబుల్ ఫరీద్ మరియు కానిస్టేబుల్స్ రాజు, దినేష్ లు పాల్గొన్నారు.

## టీబి రోగులకు న్యూట్రిషన్ కిట్టులు అందజేత



గూడూరు మండల ప్రతినిధి:- జులై 18. (తెలంగాణ పత్రిక):-

మహబూబాబాద్ జిల్లా, శనివారం రోజున గూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అలాగే అయోధ్యాపురం సెంటర్ లలో టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్ లను అందజేశారు. గూడూరు పరిధిలో మొత్తం 28 టీబీ కేసులు నమోదయ్యాయి. వారికి మందులు తో పాటు న్యూట్రీషన్ల కిట్ లను అందించారు.ఈ కిట్ లో 1కేజీ గోధుమ పిండి, 1కేజీ పప్పు, ఆయిల్ ప్యాకెట్, మీల్ మేకర్ ప్యాకెట్, ప్రోటీన్ పౌడర్ 2, ఎగ్స్ 4. ఈ కార్యక్రమంలో డాక్టర్ పవన్ కుమార్ మెడికల్ ఆఫీసర్, పీహెచ్ఎన్- మేరీ, హెల్త్ సూపర్వైజర్ రామీల్, హెల్త్ అసిస్టెంట్ సర్దార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, రోగులు, తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాకలెక్టర్ ను కలిసిన ఉమ్మడి జిల్లాల ఈఈ

కామారెడ్డి, జులై 18,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



హనుమకొండ జిల్లా కార్యనిర్వాహక ఇంజనీర్ గా విధులు నిర్వహించి, నిజామాబాద్--కామారెడ్డి జిల్లాల TGEWIDC కార్యనిర్వాహక ఇంజనీర్గా బదిలీపై బాధ్యతలు స్వీకరించిన రవీందర్ శనివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ను కలెక్టర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# రాఘవపురంలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**-అంబేద్కర్ ఆశయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత: వక్తలు**

సుజాతనగర్, జూలై 18 (తెలంగాణ పత్రిక):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలోని రాఘవపురం గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సామాజిక ఉద్యమకారుల సమక్షంలో అంబేద్కర్ విగ్రహాన్ని పూలమాలతో అలంకరించి ఘనంగా ఆవిష్కరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కురిమెళ్ల శంకర్, సుజాతనగర్ మండల నాయకులు జంపాల వెంకట్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు వేల్పుల భాస్కర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, సహకార సంఘం చైర్మన్ మండే వీర హనుమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ బాషా, తెలంగాణ జన సమితి నాయకులు మల్లెల రామనాథం నాయకులు జేబీ శౌరి, ఎర్ర



కామేష్, మారపాక రమేష్, గ్రామ సర్పంచ్, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, బహుజన సామాజిక నాయకులు, ఉద్యమకారులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా దేశ ప్రజలకు సమాన హక్కులు, సామాజిక న్యాయం, విద్య, స్వేచ్ఛ, సమానత్వం వంటి విలువలను అందించారని కొనియాడారు. తన వ్యక్తిగత జీవితాన్ని సమాజ అభ్యున్నతికి అంకితం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సామాజిక సమానత్వం కోసం



కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో అంబేద్కర్ భావజాలం మరింత విస్తరించాలని, భావితరాలకు ఆయన సిద్ధాంతాలను చేరవేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా పూలమాలలు సమర్పించి నివాళులర్పించగా, జై భీమ్ నినాదాలతో రాఘవపురం గ్రామం మార్మోగింది. గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అధిక మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష

కొత్తగూడెం, జూలై 18 (తెలంగాణ పత్రిక):

మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు కొత్తగూడెం రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. రవికుమార్ రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. శనివారం విచారణ చేపట్టిన న్యాయస్థానం, నిందితులు నేరాన్ని అంగీకరించడంతో ఈ మేరకు తీర్పు వెలువరించింది. మొదటి కేసులో పూసుగూడెం సుబ్బనపల్లికి చెందిన పద్దాం నవీన్ 2026 జూన్ 29న పాల్వంచ పెద్దమ్మగుడి సమీపంలో మద్యం మత్తులో వాహనం నడుపుతూ పాల్వంచ రూరల్ పోలీసులకు చిక్కాడు. అతని రక్తంలో ఆల్కహాల్ శాతం 250 మిల్లీగ్రాములు/100 మిల్లీలీటర్ల రక్తంగా నమోదైంది. ఈ ఘటనపై పాల్వంచ రూరల్ ఎస్సై బి. సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. రెండో కేసులో ఇల్లందు లక్ష్మీనగర్కు చెందిన బెల్లం మధుకుమార్ 2026 జూన్ 28న కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్



స్టేషన్ సమీపంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్సై జి. ప్రవీణ్ కుమార్కు చిక్కాడు. అతని రక్తంలో ఆల్కహాల్ స్థాయి 314 మిల్లీగ్రాములు/100 మిల్లీలీటర్ల రక్తంగా నమోదైంది. ఈ రెండు కేసుల్లోనూ నిందితులు కోర్టులో నేరాన్ని అంగీకరించడంతో, ఇద్దరికీ రెండేసి రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు.




విచారణలో పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ కోర్టు డ్యూటీ అధికారి పీసీ ఎ. మోహన్బాబు, కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ అహ్మద్ పాషా సహకరించారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ బి. రవికుమార్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ఇటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సింగరేణి ప్రధాన కార్యాలయము నందు తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాలు







భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూలై 18

ప్రతిష్టాత్మకమైన తాడిచర్ల బొగ్గు బ్లాకు-2 సింగరేణికి కేటాయింపుపై తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా నిర్వహించే తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాలలో భాగంగా శనివారము నాడు సింగరేణి కార్పొరేట్ ఏరియా లోని సింగరేణి ప్రధాన కార్యాలయము, మెయిన్ వర్క్ షాప్, సెంట్రల్ వర్క్ షాప్ సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు ఘనముగా నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయము నందు నిర్వహించిన కార్యక్రమానికి జిఎం(పర్సనల్) వెల్ఫేర్ ఢ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన వహించగా ముఖ్య అతిధులుగా డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(పిడపి) కే.వెంకటేశ్వర్లు, మెయిన్ వర్క్ షాప్ సెంట్రల్ వర్క్ షాప్ నందు జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డైరక్టర్(ఈఎం) ఎం.తిరుమల రావు హాజరైనారు. ఈ తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాల సంధర్భముగా వారు మాట్లాడుతూ గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎ. రేవంత్ రెడ్డి సహకారం, గౌరవరాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ, సింగరేణి చైర్మన్ ఢ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి సమర్థ నాయకత్వం, సింగరేణి డైరెక్టర్ల బృందం సమిష్టి కృషి ఫలితంగానే తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్కు కేంద్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ మంజూరు చేసిందని, తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్లో సుమారు 430 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు, 300 మిలియన్ టన్నుల జి-9 గ్రేడ్ బొగ్గు వెలికితీత అనుకూలంగా ఉండగా, సంవత్సరానికి సుమారు 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపట్టే అవకాశం ఉందన్నారు. ఈ గనికి సుమారు 40 సంవత్సరాల గని జీవితం ఉండనున్నదని, ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు సింగరేణి సంస్థ భవిష్యత్ అభివృద్ధికి, తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గడచిన 10 సంవత్సరాల కాలంలో సింగరేణి కి నూతన గనులు లేని తరుణం లో వేలం లో పాల్గొనకుండానే సింగరేణి సంస్థకు తాడిచర్ల-2 బ్లాక్ ను కేటాయించడం మంచి శుభపరిణామం అని, ఈ బ్లాక్ సింగరేణి సంస్థ భవిష్యత్తు అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని తెలిపారు. తాడిచర్ల-2 బ్లాక్ కేటాయించిన విధముగా సింగరేణిలోని వివిధ ఏరియాలలో పెండింగ్లో ఉన్న బొగ్గు బ్లాకులను సైతం సింగరేణికే కేటాయిస్తే సుదీర్ఘ చరిత్ర గల సింగరేణికి మరింత భవిష్యత్ తథ్యం అని తెలిపారు. ఇదే స్ఫూర్తితో అందరము కలిసికట్టుగా భద్రతతో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ, వినియోగదారునికి నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తూ, మరిన్ని విజయాలను సాధించాలన్నారు. 137 సంవత్సరాల సుధీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ భవిష్యత్తులో కూడా మనుగడ సాధించాలంటే నూతన గనులు ప్రారంబించుకోవటం తో పాటు ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ, యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకొని ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకొని 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం తో మనమందరం కృషి చేయాలని తెలిపారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి వ్యయం నియంత్రించుకొని వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని అప్పుడే కంపనీకి




భవిష్యత్తు ఉంటుంది అన్నారు. అనంతరం ఉద్యోగులు అందరికీ గౌరవ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సందేశం వినిపించి, ఉద్యోగులకు మిఠాయితో పాటు ఉప ముఖ్యమంత్రి సందేశ కరపత్రాలను పంపిణీ చేశారు.

తాడిచర్ల 2 కేటాయింపు కోసం కృషి చేసిన గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎ. రేవంత్ రెడ్డి కి, గౌరవ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి కి అన్ని యూనియన్లు, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలకు, సింగరేణి సంస్థ ఉన్నత అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ ఢ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో డైరక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(పిడపి) కే.వెంకటేశ్వర్లు డైరక్టర్(ఈఎం) ఎం.తిరుమల రావు, జిఎం(సిపిపి) ఏ.మనోహర్ తో పాటు గుర్తింపు సంఘం (ఏఐటిఉయూసి) -సెంట్రల్ సెక్రటరీ వంగా వెంకట్, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియూసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతాంబర రావు, కార్పొరేట్ సిఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎస్.వెంకటా చారి కార్పొరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లుఅధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నాం ఎమ్మెల్యే జారె, ఎంపీ రఘురామిరెడ్డి

తెలంగాణ పత్రిక దమ్మపేట జూలై 18

అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ మరియు ఉమ్మడి జిల్లా లిపార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామి రెడ్డి లి దమ్మపేట మండలంలోని నాచారం, వడ్లగూడెం, మారప్పగూడెం పంచాయితీ పరిధిలోని పాత చీపురుగూడెం, కొత్త చీపురుగూడెం గ్రామాల్లో పర్యటించారు ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్ల అభివృద్ధి పనులను ప్రజాపతినిధులు,అధికారులతో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు అదేవిధంగా ఆయా గ్రామాల్లోని సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం నాచారం గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను, వడ్లగూడెం గ్రామంలో 15 లక్షలతో అడ్డూరి చిన్న నాగేశ్వరరావు ఇల్లునుంచి తూతా జగన్ గారి ఇంటి వరకు నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.





అదేవిధంగా మారప్పగూడెం పంచాయితీ పాత చీపురుగూడెం గ్రామంలో 5 లక్షలతో నిర్మించిన పంచాయితీ సీసీ రోడ్డు నుంచి కోర్స గంగరాజు ఇంటి వరకు సీసి రోడ్లు మరియు కొత్త చిపురుగూడెం గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి పూర్ణయ్య ఇంటి వరకు గల సీసీ రోడ్డును ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందించే నిధులను సమర్థవంతంగా వినియోగించి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడానికి సీఎంఆర్ఎఫ్ నిధులు ఎంతో దోహదపడతాయన్నారు అభివృద్ధి పనులు ప్రజలకు అనుకూలంగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు అధికారులు, జిల్లా,మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

# వెల్దుర్తి రైతులకు కొత్త సాగు దిశ “వరి తగ్గించండి... లాభాలు పెంచుకోండి”

**-భూగర్భ జలాల కొరత దృష్ట్యా వరి సాగు తగ్గించాలని సూచన**

**-వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలతో లాభాలు పెంచుకోవాలని**

**-వ్యవసాయ అధికారి జాన్సీ పిలుపు**

వెల్దుర్తిమండల ప్రతినిధి,జులై 18 (తెలంగాణ పత్రిక):

వెల్దుర్తి మండల రైతు వేదికలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, తక్కువ వర్షపాతం, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి జాన్సీ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల్లో వరి సాగు రైతులకు ఆర్థిక భారంగా మారే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల తక్కువ నీటితో మంచి దిగుబడులు, మెరుగైన ఆదాయం





అందించే పత్తి, కందులు, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఆముదం వంటి పంటలను సాగు చేయడం ప్రస్తుతం అత్యంత అనుకూలమని పేర్కొన్నారు. రాబోయే రోజుల వర్షపాతం పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు సూచించారు. మొత్తం సాగు విస్తీర్ణంలో వరి విస్తీర్ణాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే నీటి వినియోగం తగ్గడంతో పాటు సాగు ఖర్చులు కూడా తగ్గి మెరుగైన లాభాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. పంటల ఎంపిక, సాగు విధానాలు, ఎరువుల వినియోగం, పురుగులు-- తెగుళ్ల నివారణ వంటి అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటారని, ఏవైనా సందేహాలు ఉంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని జాన్సీ సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల సర్పంచులు, రైతులు, విత్తన డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రైతులందరూ సుస్థిర వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి

**-వరికిప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేయాలి**

**-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట (తెలంగాణ పత్రిక) జూలై 18

జిల్లాలో రైతులందరూ సుస్థిర వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేసి సమృద్ధిగా ఆదాయం గడించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వెల్లడించారు. చిన్నశంకరంపేట మండలం, సూరారం గ్రామంలో రైతులు శ్రీ సత్యనారాయణ, రాజు, జగదీశ్ గార్ల 3 సంవత్సరాలు నిండిన ఆయిల్ పామ్ తోటను సందర్శించి తొలిసారిగా వచ్చిన ఆయిల్ పామ్ పంటకోతనుప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ, మెదక్ జిల్లాలో 2023-24 నుండి ఇప్పటివరకు 1857 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు జరిగిందని 2026-27సంవత్సరానికి జిల్లాకు 2500 ఎకరాల లక్ష్యం నిర్దేశించుకోవడంతో ఇప్పటివరకు 693 ఎకరాలలో రైతులు భూమి సిద్ధం చేసుకోగా, అందులో 354 ఎకరాలలో తోటలు స్థాపించడం జరిగిందని వెల్లడించారు.రైతులందరూ మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలపై దృష్టి సారించాలని, వాటిలో ఆయిల్ పామ్ ఒకటని తెలిపారు. దేశంలో ఏ





పంటకు లేనివిధంగా ఆయిల్ పామ్ సాగు కొరకు చట్టం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని అన్నారు. మొక్కలపై రాయితీతో పాటు, 4 సంవత్సరాల పాటు తోట నిర్వహణ మరియు అంతర పంటల సాగు కొరకు రాయితీ సొమ్మును నేరుగా రైతు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని అన్నారుఒక రైతుకు గరిష్టంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలపై రాయితీలి సదుపాయం కల్పిస్తారని చెప్పారు :ఆయిల్ పామ్ మొక్కలు నాటిన 4 సంవత్సరాల తరువాత ఎకరానికి 10-12 టన్నుల దిగుబడి వస్తుందని . ప్రస్తుతం ఒక టన్ను ఆయిల్ పామ్ గెల ధర రూ.23,852/-ఉండగా. సంవత్సరానికి ఎకరానికి రూ.2,38,520/- ఆదాయం, ఖర్చులు పోను రూ.2,00,000/- వరకు నికర ఆదాయం పొందవచ్చు. అని సుదీర్ఘంగావివరించారు.ఒక ఎకరా వరికి పట్టే నీటితో 5 ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేయవచ్చు. అని తెలిపారు. ఈ పంటకు మధ్యవర్తులు ఉండకుండా సంబంధిత కంపెనీ నేరుగా కొనుగోలు చేస్తుందని దొంగలు, కోతుల బెడద లేని పంట అని వెల్లడించారు. రైతులు ముందుకు రావాలని కోరారు.. మొదటి 4 సంవత్సరాలు పంట రాని సమయంలో అంతర పంటల ద్వారా ఆదాయం పొందవచ్చు అని వెల్లడించారు. 5 సంవత్సరాల తర్వాత కోకో, వక్క వంటి నీడను తట్టుకునే పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి శ్రీ ప్రతాప్ సింగ్ చిన్న శంకరంపేటవ్యవసాయదికారి లక్ష్మీ ప్రసన్న, ఉద్యాన, వ్యవసాయ విస్తరణ అధికారులు, వీ/o లివ్ పామ్ రిసోర్సెస్ ప్రై.లి కంపెనీ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

**-క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేయాలి**

**-అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 18, తెలంగాణ పత్రిక

జిల్లావ్యాప్తంగా నిర్మాణ పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయడం, రెండో దశలో ఇండ్ల మంజూరుపై గృహనిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, అన్ని మండలాలకు కేటాయించిన లక్ష్యం, ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలు, వివిధ దశల్లో ప్రగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు.ఇండ్లు లేని పేదల కలలను సాకారం



చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేస్తుందని తెలిపారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న వారికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని ఆదేశించారు. నిర్మాణాలు వేగవంతం చేసేలా క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా నిర్మాణాల్లో జాప్యం జరిగితే వాటి కారణాలు తెలుసుకుని, సమస్యలు పరిష్కరించి, నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ప్రగతిలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేందుకు ముందుకు వెళ్లాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు, ఏఈ లు క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారుల ఇబ్బందులు దూరం చేయాలని ఆదేశించారు. రోజూ వారీగా ఇండ్లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు.రెండో దశ నిర్మాణాల మంజూరుపై ఆరా తీసిన కలెక్టర్, నిర్మాణానికి ఆసక్తి ఉన్న అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి జయశీల తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన



ముధోల్:18జూలై(తెలంగాణ పత్రిక)

తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా ఈయేడు ఎల్ నినో ప్రభావం వల్ల నీటి సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముధోల్ ఎంపీడీవో లవ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని తరోడ, ఎడ్ బిడ్, విట్టోలి గ్రామాల్లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించే ఫామ్ ఫండ్, బోర్ వెల్, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, డ్రైనేజీ, కమ్యూనిటీ సోక్ ఫిట్స్ ఏర్పాటు కోసం గ్రామస్తులతో చర్చించారు. నీటి సంరక్షణ కార్యక్రమాలను అమలు చేసేందుకు రైతులు, సర్పంచ్ లు ప్రోత్సహించాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ కొరకు రైతులు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు కాలేవార్ రుచిత-దిగంబర్, ఆరిపోద్దిన్, ఉపసర్పంచ్ శివరాజ్,ఎంపీఓ శివకుమార్, ఏవో రచన, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ హరిచందన, గ్రామపంచాయతీ సెక్రటరీ రాజు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## అన్నాభావు సాఠే ఆశయాలను కొనసాగిద్దాం



తానూర్:18జూలై:(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రంలోని అన్నభావు సాఠే వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ జెడ్పిటిసి ఉత్తమ్ బాలేరావ్ మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి అన్నాభావు సాఠే చేసిన సేవలు చిరస్మారణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, గైక్వాడ్ సాయినాథ్, సురేష్, ప్రసాద్, దత్తు, సయ్యాజి, అమృత్, పోతన్,తానూర్ కమిటి సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భోగ శ్రావణి



జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూలై 18

ఈరోజు జగిత్యాల్ పట్టణంలో ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామివారి రథయాత్రలో పాల్గొన్న బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ భోగ శ్రావణి.ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్,5వ వార్డ్ కౌన్సిలర్ వేముల శ్రీనివాస్,42వ వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత,మ్యాదరి అశోక్, సిరిపురం శ్రీనివాస్,ఆముద రాజు,వీరబత్తిని అనిల్ కుమార్,కొంద్ర రవితేజ,సింగం పద్మ,చెన్నది మధురిమ,నిఖిల్ మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ సేవలపై క్షేత్రస్థాయిలో విద్యార్థుల సందర్శన

ముధోల్:18జూలై(తెలంగాణ పత్రిక)



మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన నాల్గోవతరగతి విద్యార్థులు శనివారం పోస్టల్ సేవలపై క్షేత్రస్థా యి సందర్శన చేశారు. ఈ సందర్భం గా పోస్ట్ మాస్టర్ గంగయ్య మాట్లా డుతూ పోస్ట్ ఆఫీస్ లో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి క్లుప్తంగా వివరించారు. పోస్ట్ ఆఫీస్ లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సుకన్య సంయోజన పథకం, పొదుపుల వివరాల గురించి తెలియజేశారు. దీంతో విద్యార్థులు కలిగిన సందేహా లను నివృత్తి చేసుకున్నారు. క్షేత్రస్థా యి పర్యటనలో భాగంగా విద్యార్థు లు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సంఘర్షణలో ఆచార్యులు రమ్య, ప్రసన్న, గౌతమి, కైలాస్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

## ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ సమీక్ష



-రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
-తాగునీటికి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి
-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 18, తెలంగాణ పత్రిక

రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎంపీడీఓలతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... జిల్లాలోని ఎగువ మానేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం రెండు టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.612 టీఎంసీల నీరు ఉందని వెల్లడించారు. అలాగే మల్కపేట రిజర్వాయర్ ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం మూడు టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.33 టీఎంసీల నీరు ఉందని, అన్నపూర్ణ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 3.50 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.45 టీఎంసీల నీరు ఉందని, మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 27.55 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.44 టీఎంసీల నీరు ఉందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో ఇప్పటివరకు లోటు వర్షపాతం నమోదు అయిందని వెల్లడించారు. ఎగువ నుంచి రిజర్వాయర్లకు వరద రావడం లేదని, ప్రస్తుతం రిజర్వాయర్లలోని నీటిని తాగునీటి కోసం ఉపయోగించాలని స్పష్టం చేశారు.ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులతో జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు ఎక్కువగా లేవని తెలిపారు. దీంతో ఆయా రిజర్వాయర్లు, చెరువులు, కుంటల కింద సాగునీరు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వివరించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పిలుపు నిచ్చారు. స్వల్ప కాలిక పంటలు, కూరగాయలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల పంటలు, ఆయిల్ పామ్ తదితర పంటల సాగు వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

### ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఫాం పాండ్స్, బోర్ వెల్స్ రీచార్జ్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఫాం పాండ్స్ తో రైతుల పొలాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, ఎన్నో లాభాలు ఉన్నాయని తెలియజేస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫాం పాండ్స్ ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో బోర్ వెల్స్ రీచార్జ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. బోర్ వెల్స్ రీచార్జ్ తో భూగర్భ జలాలు పెరిగి నీటి ఇబ్బందులు దూరమవుతాయనే విషయాన్ని తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

### డ్రై డే కచ్చితంగా పాటించాలి

జిల్లాలో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని పేర్కొన్నారు. వర్షం కురిసిన మరుసటి రోజు డ్రై డే నిర్వహించాలని తెలిపారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఒకవేళ పశువులు, మేకలు, గొర్రెలకు దానా, పశుగ్రాసం కోసం కావలసిన ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తినక ముందు, తిన్న తర్వాత చేతులు కడుక్కునేలా వివరించాలని పేర్కొన్నారు. నీటిని వేడి చేసి చల్లార్చిన తర్వాత తాగేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా నీటి పారుదల మధుకర్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వెల్దుర్తి పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా తల్లిదండ్రుల సమావేశం







-100 శాతం హాజరు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు
-విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల భాగస్వామ్యమే కీలకమని మండల విద్యాధికారి బుచ్చానాయక్

వెల్దుర్తిమండల ప్రతినిధి,జూలై 18 (తెలంగాణ పత్రిక):

పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తిలో శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెల్దుర్తి మండల విద్యాధికారి బుచ్చానాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుతూ ప్రతిరోజూ పాఠశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. పాఠశాల--తల్లిదండ్రుల సమన్వయంతోనే విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించగలరని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ, పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యాస ప్రగతి, నాణ్యమైన బోధన, హాజరు శాతం పెంపు కోసం చేపడుతున్న చర్యలను తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గత జూన్ నెలలో 100 శాతం హాజరు నమోదు చేసిన విద్యార్థులను మండల విద్యాధికారి బుచ్చానాయక్, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. భవిష్యత్తులో కూడా ఇదే క్రమశిక్షణను కొనసాగిస్తూ ప్రతిరోజూ పాఠశాలకు హాజరై విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వేములవాడ--జగిత్యాల (ఆనంతపల్లి--కోరేం వయా)

### నూతన ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం.. స్వయంగా బస్సు నడిపిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 18, తెలంగాణ పత్రిక

ప్రజల రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగుపర్చే లక్ష్యంతో వేములవాడ--జగిత్యాల (ఆనంతపల్లి--కోరేం వయా) నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సుకు కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించి, జెండా ఊపి సర్వీసును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్వయంగా డ్రైవింగ్ సీట్లో కూర్చొని కొంతదూరం బస్సును నడిపారు. ఎమ్మెల్యే స్వయంగా బస్సు నడపడంతో ప్రయాణికులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేయగా, ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ నూతన బస్సు సర్వీసును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బస్సు ద్వారా వేములవాడ, స్తంభంపల్లి, ఆనంతపల్లి, కోరేం తదితర గ్రామాల ప్రజలకు జగిత్యాలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజలు మరియు ప్రయాణికులు పాల్గొన్నారు.



## జూలై 31లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి: రాజన్న సిరిసిల్ల జిల్లా రేషన్ కార్డు లబ్ధిదారులకు జిల్లా పౌర సరఫరాల శాఖ సూచన

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 18, తెలంగాణ పత్రిక


పత్రిక ప్రకటన

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని అన్ని రేషన్ కార్డు లబ్ధిదారులు జూలై 31లోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ (వ-ఖ్జ) పూర్తి చేసుకోవాలి. ఇప్పటివరకు ఈ-కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ సూచించింది. జిల్లాలోని అన్ని చౌకధరల దుకాణాల్లో (రేషన్ షాపుల్లో) ఈ-కేవైసీ సేవలు అందుబాటులో ఉన్నాయి. సాధారణ రేషన్ కార్డు లబ్ధిదారులతో పాటు పోర్టబిలిటీ ద్వారా రేషన్ పొందుతున్న లబ్ధిదారులు కూడా తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి.త్వరలో ఈ-కేవైసీ పురోగతిపై సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో, ఇప్పటివరకు ఈ-కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు ఎలాంటి ఆలస్యం చేయకుండా తమ సమీప రేషన్ దుకాణాన్ని సంప్రదించి జూలై 31లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అశ్వాపురం ఘటనను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది

-ఆదివాసీ మహిళల గౌరవం, హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పించాలి

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూలై 18

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం, మనుబోతుల పాడు గ్రామపంచాయతీ పరిధిలో ఆదివాసీ మహిళలతో అధికారులు దురుసుగా ప్రవర్తించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆదివాసీ మహిళల గౌరవం, భద్రత, రాజ్యాంగబద్ధ హక్కులు ప్రజాస్వామ్య విలువలపై తీవ్రమైన దాడిగా పరిగణించాల్సి ఉంటుంది. ప్రతి మహిళ గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉంది. ముఖ్యంగా ఆదివాసీ మహిళల పట్ల అధికార యంత్రాంగం అత్యంత సున్నితంగా, మానవీయంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉంది. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే నిష్పక్షపాత, పారదర్శక విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని జనసేన పార్టీ డిమాండ్ చేస్తోంది. అధికార దుర్వినియోగం జరిగినట్లు తేలితే, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. మహిళల గౌరవాన్ని, ఆదివాసీల హక్కులను కాపాడటం ప్రభుత్వ యంత్రాంగం యొక్క రాజ్యాంగబద్ధ బాధ్యత. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థే భయాందోళనలకు కారణమవ్వకూడదు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి. ఆదివాసీ మహిళల గౌరవాన్ని కాపాడటం అంటే మన సమాజ గౌరవాన్ని కాపాడటమే. వారిపై ఎలాంటి అవమానం, అన్యాయం లేదా దౌర్జన్యాన్నీ నాగరిక సమాజం సహించదు. జనసేన పార్టీ మహిళల గౌరవం, భద్రత, ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ విషయంలో ఎప్పుడూ రాజీపడదు. న్యాయం, మానవత్వం, సమానత్వం అనే విలువల పట్ల తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటిస్తోంది. ఈ అంశంపై గౌరవ ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించి, తప్పు చేసిన వారెవరైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. ఆదివాసీ మహిళ గౌరవం కేవలం ఒక వ్యక్తి గౌరవం కాదు... అది మన రాజ్యాంగం, మన సమాజం, మన మానవత్వానికి ప్రతిబింబం."

## ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి



ముధోల్: 18జూలై(తెలంగాణ పత్రిక)

ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇంటింటికి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని ఏపీవో శిరీష రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎడ్ బిడ్ గ్రామంలో గ్రామస్తులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో ఫామ్ ఫండ్, పండ్ల తోటలు, ఆయిల్ ఫామ్ గురించి తెలియజేశారు. గ్రామంలో నర్సరీ నుండి ఐదో తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువ మోతాదులో ఉండడంతో ఆరుతడి పంటల పైన దృష్టి సారించాలని ఏవో రచన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామ్ చందర్ రెడ్డి, నాయకులు నిమ్మ పోతన్న, తోపాటు తదితరులు పాల్గొన్నారు

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమగ్ర చర్యలు చేపట్టాలి

-పిహెచ్‌సీ వైద్యాధికారులతో డీఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకట్ వీడియో కాన్ఫరెన్స్

కామారెడ్డి ,జూలై 18, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాలోసీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలు , క్షేత్రస్థాయి ఆరోగ్య సేవలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె. వెంకట్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలు మరియు ఏఎన్ఎంల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరం, డయేరియా మరియు ఇతర సీజనల్ వ్యాధుల కేసులను ప్రారంభ దశలోనే గుర్తించాలని ఆదేశించారు. గుర్తించిన కేసులకు వెంటనే చికిత్స అందించడంతో పాటు అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

**హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలి**

హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు మత పెద్దలు, కుల పెద్దలు మరియు ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ సురక్షితమైనదని, బాలికలు మరియు మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఇది ఎంతో ఉపయోగకరమని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన బాలికకు వ్యాక్సినేషన్ అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ప్రతి పిహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య శిబిరాలు**

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవసరమైన మందులు అందించడంతో పాటు వ్యాధులను గుర్తించి తగిన చికిత్సలు చేయించుకోవాలని ఆయన సూచించారు.

# బోయినపల్లి మండలంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విస్తృత పర్యటన..

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, నూతన బస్సు సర్వీసు ప్రారంభం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 18, తెలంగాణ పత్రిక





రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో శనివారం చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. పర్యటనలో భాగంగా ముందుగా మల్కాపూర్ గ్రామంలో మహిళా సంఘం (యూూ) భవన నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆనంతపల్లి గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు, స్థానిక ప్రజల చిరకాల కోరిక అయిన వేములవాడ--జగిత్యాల (ఆనంతపల్లి--కోరేం వయా) నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొంతదూరం బస్సును స్వయంగా నడిపి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తదుపరి కోరేం, స్తంభంపల్లి గ్రామాల్లో మహిళా సంఘ భవన నిర్మాణాలకు భూమిపూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అనంతరం బోయినపల్లి మండల కేంద్రంలో నూతన గిడ్డంగి (గోదాం) నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. తర్వాత బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన పవర్‌లూమ్ మ్యాక్ సొసైటీ బతుకమ్మ చీరల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి, నేతన్నలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. చివరిగా విలాసాగర్ గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, కొదురుపాక గ్రామంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమిపూజతో పాటు పలు స్థానిక అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని తన పర్యటనను ముగించారు. ఈ కార్యక్రమాల్లో బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మనబోయిన సుధీన్ యాదవ్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐకేపీ మహిళలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# 2.55 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి






-ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టిక ఆహారం..
-ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడులు..
-కాంగ్రెస్ హయంలో విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం..
-సర్కారు బడుల్లో గణనీయమైన ఫలితాలు..
-బొంపెల్లి నుండి తెనుగుపల్లి వరకు 50 లక్షల రూపాయలతో బి.టి రోడ్డు నిర్మాణం
-ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..

పెద్దపల్లి, ప్రతినిధి జూలై 18 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల, నిట్టూరు, తుర్కల మద్దికుంట, బొంపల్లి, రాగినేడు మరియు అప్పన్నపేట గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో రూ.2.55 కోట్ల డి.ఎం.ఎఫ్.టి నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల తో కలిసి శంకుస్థాపన చేశారు. తదుపరి పెద్దకాల్వల గ్రామంలో నూతనంగా 5 లక్షల రూపాయలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు ప్రారంభించిబొంపెల్లి గ్రామంలోని ఆర్ ఒ బి రోడ్డు నుండి తెనుగుపల్లి వరకు 50 లక్షల రూపాయలతో బి.టి రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ. గత ప్రభుత్వ మరియు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతో పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యం కావడం జరిగిందని,అలాగే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు..ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి పెద్దకల్వల గ్రామ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 19 లక్షలు, నిట్టూరు గ్రామ పాఠశాలకు రూ. 45 లక్షలు, తుర్కల మద్దికుంట గ్రామానికి రూ. 48 లక్షలు, బొంపల్లి గ్రామానికి రూ.25 లక్షలు, రాగినేడు గ్రామానికి రూ. 58 లక్షలు, అప్పన్నపేట గ్రామానికి రూ. 60.50 లక్షల నిధులను వెచ్చించడం జరిగిందన్నారు. పెద్దపల్లి మండలం మరియు పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ.5.70 కోట్లను మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని అందులో చదివే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా విద్యారంగంలో టాప్ లో నిలిచిందని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచామని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించడం జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాసంస్థలకు మెరుగైన సదుపాయాలను అందిస్తున్నామని ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడులు అభివృద్ధి చెందుతున్నాయని పార్టీలకు అతీతంగా కలిసి కట్టుగా ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుకు కృషి చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ పట్టాలు జారీ చేశారంటూ ఆరోపణలు

-తహశీల్దార్‌కు బాధితుల ఫిర్యాదు
-రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి



ఆత్మకూరు, జూలై 18 (తెలంగాణ పత్రిక):

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగట్టు గ్రామంలో 2018లో రెవెన్యూ అధికారులు అక్రమంగా పట్టాలు జారీ చేశారంటూ ఇద్దరు రైతులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం ఆత్మకూరు తహశీల్దార్ జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో పాటు విలేకరుల సమావేశంలో తమ ఆవేదనను వెల్లడించారు. కొత్తగట్టు గ్రామానికి చెందిన సుద్దాల మొగిలి, సుద్దాల పరశురాములు మాట్లాడుతూ, సర్వే నంబర్ 153లో ఒక్కొక్కరికి 0.23 గుంటల చొప్పున భూమిని 1980 సంవత్సరం నుంచి నిరంతరాయంగా సాగు చేస్తూ అనుభవిస్తున్నామని తెలిపారు. సంబంధిత రెవెన్యూ రికార్డుల్లో కూడా తమ పేర్లు నమోదై ఉన్నాయని చెప్పారు. తమ భూములకు సాదా బైనామా ద్వారా హక్కులు కల్పించాలని గతంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారులు తిరస్కరించారని తెలిపారు. అయితే అదే భూమికి సంబంధించి అప్పట్లో వీఆర్‌ఏగా పనిచేసిన నిమ్ముల సాంబయ్య తండ్రి కొమురయ్య పేరిట పట్టా జారీ కావడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై పాత రికార్డులు, ఫైళ్లను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు న్యాయం చేయాలని తహశీల్దార్ జగన్మోహన్ రెడ్డిని బాధితులు కోరారు.

# ఎదురెదురుగా బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

జుక్కల్ ఆర్సి/ (తెలంగాణ పత్రిక) జూలై 18

మహమ్మద్ నగర్ మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు తన కుమార్తె శ్రీవాణిని చికిత్స కోసం గురువారం ఉదయం మొహమ్మద్‌నగర్ ఆస్పత్రికి తన బైక్ టీ16జుఖీ6425పై తీసుకెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం, ఎన్‌హెచ్-765డీ రహదారిపై బాన్స్వాడ నుంచి మొహమ్మద్‌నగర్ వైపు వస్తున్న బైక్ టీ10జ్7388 ఎదురుగా వచ్చి ఢీకొనడంతో కుమ్మరి రాజు, శ్రీవాణితో పాటు మరో బైక్ పై వస్తున్న పెద్దగొళ్ల సందీప్ అన్నాసాగర్ గ్రామం తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ముగ్గురిని వెంటనే చికిత్స నిమిత్తం బాన్స్వాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కుమ్మరి రాజు భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన



ముధోల్:18జూలై(తెలంగాణ పత్రిక)


తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా ఈయేడు ఎల్ నినో ప్రభావం వల్ల నీటి సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముధోల్ ఎంపీడీవో లవ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని తరోడ, ఎడ్ బిడ్, విట్టోలి గ్రామాల్లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించే ఫామ్ ఫండ్, బోర్ వెల్, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, డ్రైనేజీ, కమ్యూనిటీ సోక్ ఫిట్స్ ఏర్పాటు కోసం గ్రామస్తులతో చర్చించారు. నీటి సంరక్షణ కార్యక్రమాలను అమలు చేసేందుకు రైతులు, సర్పంచ్ లు ప్రోత్సహించాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ కొరకు రైతులు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు కాలేవార్ రుచిత-దిగంబర్, ఆరిపోద్దిన్, ఉపసర్పంచ్ శివరాజ్,ఎంపీఓ శివకుమార్, ఏవో రచన, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ హరిచందన, గ్రామపంచాయతీ సెక్రటరీ రాజు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఒకే కుటుంబానికి రెండు ఆయా పోస్టుల కేటాయింపుపై ఆరోపణలు

-సమగ్ర విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 16 ( తెలంగాణ పత్రిక):**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాలకోయ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయా పోస్టుల కేటాయింపుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు పాలకోయ తండాకు చెందిన భూక్య సుశీల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి నిష్పక్షపాత విచారణ జరిపి అర్హులైన స్థానిక అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, పాలకోయ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టును స్థానికంగా అర్హత కలిగిన భూక్య దివ్యకు కేటాయించాలని తండా పెద్దలు నిర్ణయించినప్పటికీ, అదే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇప్పటికే అదే పాఠశాలలో ఆయా పోస్టుల్లో కొనసాగుతున్నారని ఆరోపించారు. వినతిలో పేర్కొన్న పేర్ల ప్రకారం, జక్కుల రమాదేవి (భర్త: వెంకటేష్), జక్కుల స్పందన (భర్త: నాగరాజు) ఒకే కుటుంబానికి చెందిన వారిగా పేర్కొంటూ, వారికి ఒకే పాఠశాలలో ఆయా పోస్టులు కేటాయించడం వల్ల ఇతర అర్హులైన స్థానిక అభ్యర్థులకు అన్యాయం జరిగిందని భూక్య సుశీల ఆరోపించారు. అలాగే, ఈ నియామక ప్రక్రియలో పాలకోయ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, పాల్వంచ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) శ్రీరామ్ మూర్తి పాత్రపై కూడా విచారణ జరిపించాలని వినతిపత్రంలో కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే సంబంధిత అధికారులపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నియామక నిబంధనలు, స్థానిక అర్హతలు, పారదర్శకత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మొత్తం వ్యవహారంపై జిల్లా స్థాయి విచారణ నిర్వహించాలని, అర్హత కలిగిన స్థానిక అభ్యర్థులకు అవకాశం కల్పించాలని భూక్య సుశీల కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీసి, అర్హులకు న్యాయం చేయాలని పాలకోయ తండా ప్రజలు కూడా కోరుతున్నట్లు సమాచారం.

## కొదురుపాకలో వీఓ భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 18, తెలంగాణ పత్రిక**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో మహిళా సంఘం (వీఓ) భవన నిర్మాణానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళా సంఘాలకు శాశ్వత వసతులు కల్పించడం ద్వారా వారి కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగుతాయని అన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, మహిళా సంఘాల బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ కత్తెరపాక మంజుల సుధాకర్ మరియు వార్డ్ సభ్యులు ,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, ఐకేపీ మహిళలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పేరుతో జరుగుతున్న దోపిడిని అరికట్టి చర్యలు తీసుకోవాలి

**మునగాల - ప్రతినిధి, , జూలై 18: తెలంగాణ పత్రిక**

మునగాల మండలంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా లాభాల వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పేరుతో నిలువునా దోచుకుంటున్నా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) వెంకటేశ్వర్లు కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి మాట్లాడుతూ, అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, ప్రత్యేక ఫీజుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేయడమే కాకుండా, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలను యాజమాన్యాలు సూచించిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని




తల్లిదండ్రులను బలవంతం చేయడం బహిరంగ దోపిడీ అని మండిపడ్డారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం విపరీతంగా పెరిగి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థలు విద్య పేరుతో ప్రజలను దోచుకోవడం అమానుషమని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను ధిక్కరిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై అధికారులు ఇప్పటికైనా ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నిర్మాణంపై ప్రత్యేక విచారణ చేపట్టి, అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాల గుర్తింపుతో కఠిన చర్యలు తీసుకోవాలని, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంల పేరుతో జరుగుతున్న బలవంతపు వసూళ్లను వెంటనే నిలిపివేయాలని కోరారు. విద్యను వ్యాపార వస్తువుగా మార్చిన విద్యా మాఫియాను ప్రభుత్వం నియంత్రించకపోతే, విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి మండల వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు శ్రీధర్, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు

# జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్ కు వినతి పత్రం అందజేసిన మాజీ జడ్పీటిసి తీగల తిరుమల గౌడ్

**కామారెడ్డి,జులై 18,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర కామారెడ్డి నియోజకవర్గ బిక్నూర్ మండలం దోమకొండ దారిలో జాతీయ రహదారి 44 అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ సురేష్ షట్కార్ కి వినతి పత్రం అందజేసిన దోమకొండ మండల మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్ గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ,సర్పంచ్ ఐరన్ నరసయ్య, కాంగ్రెస్ నాయకులు. అనంతరం దోమకొండ , బిబిపేట్ మండలాలకు కామారెడ్డి వరకు వెళ్ళుటకు ప్రధాన రహదారిగా ఉన్న బి టి ఎస్ వద్ద గల జాతీయ రహదారి 44 వద్ద అండర్ పాస్ బ్రిడ్జి చిన్నదిగా నిర్మాణం చేయడం వలన ఆ బ్రిడ్జి నుండి కేవలం చిన్న వాహనాలు మాత్రమే వెళ్ళుచున్నాయి భారీ వాహనాలు అయిన ఆర్టీసీ మరియు లారీలు ఇప్పటివరకు జాతీయ రహదారి 45 యు టర్న్



తీసుకొని కామారెడ్డి వైపు వెళ్ళుచుండేవి అయితే ఆ యూటర్న్ వద్ద ప్రమాదాలు జరుగుచున్నందున అధికారులు అటు యూటర్న్ మూసివేసినారు ప్రస్తుతం కామారెడ్డి వెళ్లాలంటే ఆర్టిసి బస్సులు మరియు ఇతర భారీ వాహనాలు అన్ని బిక్నూర్ టోల్ ప్లాజా వద్దకు వెళ్లి యు టర్న్ చేసుకొని కామారెడ్డి వైపు వెళ్ళవలసి వస్తుంది. దీనివలన బిబిపేట మరియు దోమకొండ మండలం చెందిన ప్రయాణికులు కామారెడ్డికి వెళ్లాలంటే సమయభారం తప్పడం లేదు కావున ఇట్టి సమస్యను దృష్టిలో ఉంచుకొని బిటిఎస్ వద్ద ఆర్టిసి బస్సులు, భారీ వాహనాలు వెళ్ళుటకు వీలుగా అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా సమస్యలు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అతి త్వరలో ఇట్టి సమస్యను పరిష్కారం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో దోమకొండ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సీతారాం మధు, దిశ మెంబర్ పోగుల కవిత, నేతుల మల్లేష్ బత్తిని సిద్ధ రాములు, కటిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి

**మునగాల - ప్రతినిధి, జూలై 18, తెలంగాణ పత్రిక**

సీఐటీయూ అనుబంధ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న సూర్యాపేట కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు కోల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తాడువాయి, నేలమర్రి, మాదారం, రామసముద్రం, రేపాల, కలకవ గ్రామాల్లో కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు.

**ఈ ధర్నాలో ప్రధానంగా:**

- జి.ఓ. నెం.12ను కార్మికులకు అనుకూలంగా సవరించాలి.
- భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను ప్రైవేట్ బీమా కంపెనీలకు మళ్లించకుండా కార్మికుల



సంక్షేమానికే వినియోగించాలి.
- పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల క్లెయిమ్‌లను వెంటనే మంజూరు చేయాలి.
- నిర్మాణ కార్మికులకు ఇల్లు, పింఛన్, ఆరోగ్య భద్రత, పిల్లల విద్యా సహాయం వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి.
- కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి.

కార్మికులందరూ అధిక సంఖ్యలో హాజరై ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గంట వెంకటేశ్వర్లు, కోల ఆంజనేయులు, మండల కమిటీ అధ్యక్షుడు ఎస్కే దస్తగిరి, ప్రధాన కార్యదర్శి అలీ నాగరాజు, మండల కోశాధికారి నాగేంద్రబాబు, నాగేశ్వరరావు, నేలమర్రి అధ్యక్షుడు రాంపంగు వెంకన్న, తాడువాయి అధ్యక్షుడు బాల, ఉపేందర్, కార్యదర్శి చిలివేలు రాంబాబు, మాదారం అధ్యక్షుడు ఎస్కే సైదా, గురవయ్య, కలకవ అధ్యక్షుడు పనస శీను తదితరులు పాల్గొన్నారు.

## పిఎన్పిఆర్ఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ కామారెడ్డి డివిజన్ జిల్లా అధ్యక్షుడిగా షేక్ అజీజ్

**కామారెడ్డి, జులై 18,**
**(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలోని జీఎన్ఆర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నేతి రాజేశ్వర్ రావు సమక్షంలో కామారెడ్డి జిల్లా ఆర్.ఎం.పి, పి.ఎం.పి అసోసియేషన్ అధ్యక్షుడు నిజ్జన విఠల్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కామారెడ్డి డివిజన్ జిల్లా అధ్యక్షుడిగా మాచారెడ్డి మండలం సోమారంపేట గ్రామానికి చెందిన ప్రముఖ పి.ఎం.పి వైద్యులు షేక్ అజీజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డివిజన్ జిల్లా అధ్యక్షుడు షేక్ అజీజ్ మాట్లాడుతూతనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన అసోసియేషన్ సభ్యులకు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.డివిజన్ పరిధిలోని ఆర్.ఎం.పి పిఎంపి వైద్యుల హక్కుల సాధనకై, వారి సమస్యల పరిష్కారానికై



నిరంతరం శ్రమిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అందరినీ కలుపుకొని అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా అసోసియేషన్ ముఖ్య నాయకులు, వివిధ మండలాల ప్రతినిధులు మరియు వైద్య మిత్రులు పాల్గొని షేక్ అజీజ్ గారిని శాలువాలతో ఘనంగా సత్కరించి, శు భాకాంక్షలు తెలియజేశారు.

**ఈ కర్యక్రమాంలో:**

రాష్ట్ర గౌరవ అధ్యక్షులు హన్మంతరావు, హైదరాబాద్ గౌరవ అధ్యక్షులు కంటే సాయిన్న, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కిషణ రెడ్డి, మల్కాజ్గిరి వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అశోక్ రాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతాల బుచ్చిరెడ్డి, దాసరి మాణిక్యం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు ఉద్యోగాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు

సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తుందని, అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ఇప్పటికే 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు భరోసా కల్పించామని ఆయన తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగుల కలలను నిజం చేస్తున్నామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేవలం కల్వకుంట్ల కుటుంబ సభ్యులకు మాత్రమే పదవులు, అవకాశాలు దక్కాయని, అప్పట్లో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు లోనైందని ఆయన ఆరోపించారు. ఆనాడు ఉద్యోగాల భర్తీని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు నిరుద్యోగుల పేరుతో రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన బీఆర్ఎస్ పార్టీ వాస్తవాలను గుర్తించి విమర్శలు మానుకోవాలని ఆయన సూచించారు.

## అమర్‌నాథ్ యాత్ర రద్దు.. రెండు మార్గాలు మూసివేత..!

భారత వాతావరణ శాఖ జారీ చేసిన తీవ్ర వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జూలై 19 నుంచి పహల్గామ్, బల్తాల్ మార్గాల ద్వారా పవిత్ర గుహకు వెళ్లే యాత్రను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం, ఆకస్మిక వరదల ముప్పు ఉన్న నేపథ్యంలో ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారుఅధికారుల నిర్ణయం ప్రకారం జూలై 19 నుంచి బల్తాల్ బేస్ క్యాంప్, నున్వాన్--చందన్‌వారి బేస్ క్యాంపుల నుంచి యాత్రికులను ముందుకు అనుమతించరు. ప్రస్తుతం బేస్ క్యాంపుల్లో ఉన్న యాత్రికులకు కూడా అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారిన తర్వాత, యాత్ర మార్గాల భద్రతను పూర్తిగా పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని యాత్ర నిర్వహణ కమిటీ వెల్లడించింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జమ్మూ-కశ్మీర్‌లోని పర్వత ప్రాంతాల్లో భూస్ఖలనం, రాళ్లు జారిపడే ప్రమాదం పెరిగిందని అధికారులు తెలిపారు. యాత్ర మార్గంలో ప్రయాణించే భక్తుల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అయితే, యాత్రికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు. యాత్ర తిరిగి ప్రారంభించే తేదీని వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు.ఈ నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రకు బయలుదేరే భక్తులు అధికారిక ప్రకటనలు, స్థానిక పరిపాలన, యాత్ర నిర్వహణ కమిటీ సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయానికి యాత్రికులు సహకరించాలని అధికారులు కోరారు.

# బిజినెస్

## రూ.2 వేలకుపైగా యూపీఐ పేమెంట్స్‌కు ఛార్జీలు?- వారికి మినహాయింపు!

ఇంటర్నెట్ డెస్క్:
దేశంలో డిజిటల్ చెల్లింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. రూ.2 వేలకుపైగా జరిగే యూపీఐ(యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటు ను మళ్లీ అమలు చేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇది ఆమోదం పొందితే.. అర్హత ఉన్న లావాదేవీలపై వ్యాపారులు గరిష్ఠంగా 0.5 శాతం వరకు ఎండీఆర్ చెల్లించాల్సి రావచ్చు. దీనిపై వచ్చే నెలలో తుది నిర్ణయం వెలువడే అవకాశాలున్నాయి. అయితే.. చిరు వ్యాపారులకు ఈ ప్రతిపాదనలో ఊరట కలిగించే అవకాశముంది. ఆన్యువల్ టర్నోవర్ రూ.1.5 కోట్ల వరకు ఉన్న వ్యాపారస్థులకు లావాదేవీల విలువ ఎంత ఉన్ననూ ఎండీఆర్ నుంచి మినహాయింపునివ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన ప్రధానంగా పెద్ద వ్యాపార సంస్థలపైనే ఈ భారం పడే అవకాశముంది.

**-అసలేమిటీ ఎండీఆర్?**
డిజిటల్ చెల్లింపులను స్వీకరించేందుకు వ్యాపారస్థులు బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలకు చెల్లించే రుసుమే ఎండీఆర్. ప్రతి డిజిటల్ లావాదేవీలో కొంత శాతాన్ని ఇలా వసూలు చేస్తారు. చెల్లింపుల ప్రాసెసింగ్, సెటిల్‌మెంట్, సాంకేతిక నిర్వహణ, భద్రత వంటి ఖర్చులను భర్తీ చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది. అయితే.. యూజర్ల నుంచి నేరుగా ఈ రుసుమును వసూలు చేయరు. కొన్ని సందర్భాల్లో ఈ సొమ్మును వస్తువుల ధరల్లోనే పరోక్షంగా వసూలు చేస్తుంటారు.




## ‘బాస్ స్కామ్’పై జర జాగ్రత్త: సెబీ

న్యూఢిల్లీ:
బాస్ స్కామ్‌పై అప్రమత్తంగా ఉండాలని లిస్టెడ్ కంపెనీలు, తన నియంత్రణ పరిధిలోని సంస్థలను క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కోరింది. తాము చెప్పిన బ్యాంకు ఖాతాలకు నిధులు బదిలీ చేయాలని కంపెనీల ఎండీలు, సీఈఓల్లా నటిస్తూ కొందరు కేటుగాళ్లు పంపే ఈ-మెయిల్స్, వాట్సప్, మైక్రోసాఫ్ట్ టీమ్స్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే మెసేజ్‌లను ఏమాత్రం నమ్మవద్దని కోరింది. క్షుణ్ణంగా చెక్ చేసుకోకుండా వారి మాటలు, మెసేజ్‌లను నమ్మి నిధులు బదిలీ చేస్తే నిండా మునగడం ఖాయమని హెచ్చరించింది. ఇటీవల సైబర్ కేటుగాళ్లు కంపెనీల ఎండీలు, సీఈఓల్లా నటిస్తూ, తాము చెప్పే బ్యాంకు ఖాతాలకు వెంటనే నిధులు బదిలీ చేయాలని ఆయా కంపెనీల ఫైనాన్స్ లేదా అకౌంట్స్ విభాగాల్లోని ఉన్నతాధికారులకు ఈ-మెయిల్స్, వాట్సప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా మెసేజ్‌లు పంపిస్తూ నిలువునా దోచేస్తున్నారు. ఒక్కోసారి ఆయా కంపెనీల ఎండీలు, సీఈఓల వాయి?సను సైతం క్లోన్ చేసి ఫోన్ చేసి మరీ బురిడీ కొట్టిస్తున్నారు. ఒకవేళ ఏ కంపెనీ అయినా ఇలా మోసపోతే వెంటనే సైబర్ క్రైమ్స్ పోర్టల్ లేదా 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరింది. బాస్ స్కామ్‌గా పిలిచే ఈ సైబర్ నేరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సెబీ ఈ హెచ్చరిక చేసింది. డీమ్యాట్’ యూనిట్లకూ స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్స్ సౌలభ్యం: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల యూనిట్ల మదుపరులకు సెబీ మరో శుభవార్త చెప్పింది. డీమ్యాట్ ఖాతాల్లోని సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ), సిస్టమాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) యూనిట్లకు కూడా స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్స్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. వచ్చే ఏడాది జనవరి 31 లోపు, ఏప్రిల్ 30 లోపు రెండు దశల్లో ఈ మార్పులు అమలు చేయాలని సెబీ కోరింది.



## రిలయన్స్ రికార్డు ఆదాయం

ముంబై:
మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) శుక్రవారం విడుదల చేసిన ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) ఆర్‌ఐఎల్ రూ.20, 946 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇదే కాలానికి నమోదైన రూ.26,994 కోట్ల లాభంతో పోలిస్తే 22 శాతం తగ్గింది. అయితే, ఏషియన్ పెయింట్స్‌లో తమ వాటా విక్రయం ద్వారా 2025-26 క్యూ1లో రూ.8, 924 కోట్ల ఏకకాల లాభం సమకూరిందని, అందుకే ఈ క్యూ1 లాభాన్ని వార్షిక ప్రాతిపదికన పోలిస్తే భారీగా తగ్గినట్లు కనిపిస్తోందని రిలయన్స్ పేర్కొంది. ఏకకాల లాభాన్ని మినహాయిస్తే..వార్షిక ప్రాతిపదికన ఈ క్యూ1 లాభంలో దాదాపు 16 శాతం వృద్ధి నమోదయ్యేది. అలాగే, మార్చితో ముగిసిన త్రైమాసికంలో నమోదైన రూ. 16,971 కోట్ల లాభంతో పోలిస్తే మాత్రం 23.42 శాతం వృద్ధి నమోదైంది. ఈ క్యూ1లో ఆర్‌ఐఎల్‌కు వ్యాపార కార్యకలాపాల ద్వారా సమకూరిన ఆదాయం వార్షిక ప్రాతిపదికన 25.41 శాతం, త్రైమాసిక ప్రాతిపదికన 4.43 శాతం వృద్ధితో రూ.3,11,850 కోట్లకు చేరుకుంది. కంపెనీ త్రైమాసిక ఆదాయం రూ.3 లక్షల కోట్ల మైలురాయిని దాటడం ఇదే తొలి సారి. కంపెనీ ప్రధాన వ్యాపారమైన ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ)తోపాటు టెలికాం, ఆయిల్ అండ్ గ్యాస్, మీడియా వ్యాపార విభాగాలు కూడా మంచి పనితీరును కనబరచడంతో పాటు ఆదాయంలో రెండంకెల వృద్ధిని నమోదు చేయడం ఇందుకు దోహదపడింది. 2025-26 క్యూ1లో కంపెనీ రాబడి రూ.2,48,660 కోట్లుగా నమోదైంది. జూన్ చివరినాటికి రిలయన్స్ నికర రుణభారం రూ.1.23 లక్షల కోట్లుగా ఉంది.




# క్రీడలు

## ఇంగ్లండ్‌తో తుది వన్డేకు భారత్ సిద్ధం- లార్డ్స్ గడ్డపై రికార్డు మారేనా?

స్పోర్ట్స్ డెస్క్:
భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య హోరాహోరీగా సాగుతున్న మూడు మ్యాచుల వన్డే సిరీస్ ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకుంది. సిరీస్ విజేత ఎవరో తేల్చే మూడో, చివరి వన్డేకు క్రికెట్ మక్కాగా పేరొందిన లండన్‌లోని చారిత్రాత్మక ‘లార్డ్స్’ మైదానం వేదికగా నిలవనుంది. ఇప్పటికే బర్మింగ్‌హామ్‌లో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘనవిజయం సాధించగా, కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లండ్ పుంజుకుని విజయం సాధించింది. దీంతో ప్రస్తుతం సిరీస్ 1-1తో సమం కావడంతో, రేపు లార్డ్స్ వేదికగా జరగనున్న మ్యాచ్ ఇరు జట్లకు కీలకంగా మారింది.లార్డ్స్ మైదానంలో టీమిండియా వన్డే ట్రాక్ రికార్డు పరిశీలిస్తే మిశ్రమంగా ఉంది. ఇక్కడ భారత్ ఇప్పటివరకు ఆడిన 9 వన్డే మ్యాచ్‌ల్లో కేవలం 3 మ్యాచ్‌ల్లో మాత్రమే విజయం సాధించగా 5 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసింది. మరో మ్యాచ్ టైగా ముగిసింది. ఈ చరిత్రాత్మక వేదికపై ప్రతికూల రికార్డు ఉన్నప్పటికీ ప్రస్తుత ఫామ్ దృష్ట్యా గిల్ సేన సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. 1983 ప్రపంచకప్ చారిత్రాత్మక విజయం, 2002 నాట్‌వెస్ట్ సిరీస్ వంటి చిరస్మరణీయ విజయాలను భారత్.. ఈ లార్డ్స్ గడ్డపైనే సాధించింది. ఈ నేపథ్యంలో భారత జట్టు అదే ఉత్సాహంతో బరిలోకి దిగనుంది. మరి ఈ ప్రతిష్ఠాత్మక పోరులో ‘మెన్ ఇన్ బ్లూ’ పాత రికార్డులను తిరగరాసి సిరీస్ ట్రోఫీని ముద్దాడుతుందో లేదో తెలియాలంటే రేపటి(జులై 19) వరకు ఎదురు చూడాల్సిందే.




## రోహిత్ శర్మ రిటైర్‌మెంట్‌పై కపిల్ దేవ్ కీలక వ్యాఖ్యలు




స్పోర్ట్స్ డెస్క్:
టీమిండియా స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పనున్నారనే వార్తలు ఊపందుకున్నాయి. లార్డ్స్ వేదికగా జరిగే వన్డేనే రోహిత్ శర్మకు చివరి అంతర్జాతీయ మ్యాచ్ కానుందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రోహిత్ రిటైర్‌మెంట్ వార్తలపై టీమిండియా దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్ స్పందించారు. ఏదో ఒక సమయంలో అందరూ ఆటను వదిలేయాల్సిందేనని, ఎందుకు విచారం అంటూ కపిల్ దేవ్ ప్రశ్నించారు.ఓ జాతీయ మీడియాతో కపిల్ దేవ్ మాట్లాడుతూ.. రోహిత్ శర్మ ఎప్పుడు రిటైర్ అయినా.. దాన్ని ఘనంగా జరుపుకోవాలన్నారు. ఇన్నేళ్లుగా తనదైన ఆటతో క్రికెట్ ప్రియులను రోహిత్ శర్మ అలరించాడన్నారు. ‘అతడి రిటైర్మెంట్ పై వస్తున్న వార్తల్లో నిజం ఎంతో తెలియదు. ఒకవేళ నిజమే అయినా.. మనం సంతోషంగా ఉందాం. ఎందుకు బాధపడాలి?. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో ఆటకు వీడ్కోలు చెప్పాల్సిందే. సునీల్ గావస్కర్, రాహుల్ ద్రావిడ్, అనిల్ కుంబ్లే, సచిన్ వంటి క్రికెటర్లు వెళ్లిపోయారు. ప్రతిఒక్కరూ ఆటను వదలి వెళ్లాల్సిందే’ అని కపిల్ దేవ్ అన్నారు.

రోహిత్ ఘనంగా వీడ్కోలు పలుకుతాడని కపిల్ ఆశాభావం వ్యక్తం చేశారు. రోహిత్ శర్మ 2007 జూన్ 23న బెల్‌ఫాస్ట్‌లో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తన వన్డే అరంగేట్రం చేశాడు. ఇప్పటికే టీ20, టెస్ట్ ఫార్మాట్‌ల నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం జరుగుతున్న ఇంగ్లండ్ సిరీస్‌లో రోహిత్ పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతుండటంతో, అతని రిటైర్‌మెంట్ గురించిన చర్చలు ఊపందుకున్నాయి.


## జపాన్ ఓపెన్ ఫైనల్: విజయ రహస్యాన్ని రివీల్ చేసిన పీవీ సింధు

ఇంటర్నెట్ డెస్క్:
జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఫైనల్ చేరిన తర్వాత తొలిసారిగా స్పందించింది. తన విజయం వెనుక ఉన్న రహస్యాన్ని వెల్లడించింది. ప్రపంచ స్థాయి ప్లేయర్లతో తలపడేటప్పుడు ప్రతి పాయింట్ కీలకమని.. అదే ఆలోచనతో బరిలోకి దిగానని తెలిపింది. సెమీ ఫైనల్‌లో చైనాకు చెందిన చెన్ యూఫీపై గెలుపొందిన సింధు.. ఫైనల్‌కు దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం సింధు మాట్లాడింది.‘జపాన్ ఓపెన్ టోర్నీలో ఫైనల్‌కు చేరడం చాలా సంతోషంగా ఉంది. నాకు ప్రతి మ్యాచ్ ఎంతో ముఖ్యమైనదే. ముఖ్యంగా నేటి మ్యాచ్‌లో ఆరంభం నుంచే పూర్తి ఏకాగ్రతతో ఉండాలని నిర్ణయించుకున్నాను. ఎందుకంటే అత్యుత్తమ ర్యాంక్ ఉన్న ఆటగాళ్లతో ఆడేటప్పుడు ప్రతి పాయింట్ విలువైనదే. అందుకే తొలి గేమ్ గెలవడం చాలా కీలకంగా మారింది’ అని సింధు వెల్లడించింది.

**-కోచ్ మాటలే ధైర్యాన్నిచ్చాయి..**
తొలి గేమ్‌లో మంచి ఆధిక్యం సాధించిన తర్వాత యూఫీ పుంజుకుని స్కోరును 19-19తో సమం చేసింది. దీంతో తనపై ఒత్తిడి పెరిగిందని సింధు తెలిపింది. ‘నేను ఆధిక్యంలో ఉన్నప్పుడు చెన్ యూఫీ స్కోరును సమం చేసింది. అలాంటి సమయంలో కొన్ని పాయింట్లు కోల్పోతే మనసులో ఎన్నో ఆలోచనలు వస్తాయి. ‘ఇంత మంచి ఆధిక్యం ఎలా కోల్పోయా’ అనే భావన కలుగుతుంది. కానీ నా కోచ్ మాత్రం ‘అది మర్చిపో.. తర్వాతి పాయింట్‌పైనే దృష్టి పెట్టు’ అని పదే పదే చెప్పారు. అదే నాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది’ అని వివరించింది.



# పుట్టినరోజున ఫ్యాన్స్‌కు ప్రియాంక ట్రీట్ -'వారణాసి' నుంచి మందాకిని క్రేజీ లుక్!



గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ తన 44వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరి పోయే కానుక ఇచ్చారు. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రం నుంచి ఆమె ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'మందాకిని' అనే పాత్రలో ప్రియాంక చోప్రా ఫెరోషియస్ అవతార్‌లో కనిపించి సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశారు. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ 'వీక్లీ' ఈ ఫొటోలను ప్రత్యేకంగా పంచుకుంది. ఈ ఫొటోలలో ప్రియాంక పూర్తి నలుపు రంగు దుస్తులలో, ఉంగరాల జుట్టుతో చాలా భిన్నంగా కనిపిస్తున్నారు. ఒక భారీ యాక్షన్ సాంగ్‌లోని స్టిల్స్ ఇవని తెలుస్తోంది. చిత్రంలో ఆమె పోషిస్తున్న 'మందాకిని' పాత్రను "ప్రపంచవ్యాప్తంగా పర్యటించే ఒక ధైర్యవంతురాలు, శక్తిమంతమైన మహిళ. అదే సమయంలో సున్నితమైన భావోద్వేగాలు కలిగి, ప్రేక్షకుల మదిలో చిరకాలం నిలిచిపోయే పాత్ర" అని చిత్ర యూనిట్ వర్గాలు అభివర్ణించాయి. ఆస్కార్ విజేత 'RRR' తర్వాత రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న పూర్తిస్థాయి ఒరిజినల్ ఫీచర్ ఫిల్మ్ 'వారణాసి'. వేల సంవత్సరాల కాలంలో, పురాతన నాగరికతల నుంచి నేటి ఆధునిక యుగం వరకు సాగే ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ కథాంశంతో రూపొందుతోంది. అంటార్కిటికా, ఆఫ్రికా, పవిత్ర నగరం వారణాసి సహా పలు ఖండాలలో ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు సరసన నటిస్తున్నారు. మహేశ్ 'రుద్ర' అనే పాత్రలో కనిపించనున్నారు. అంతేకాకుండా రామాయణ యుద్ధ ఘట్టాలకు సంబంధించిన 20 నిమిషాల సన్నివేశంలో శ్రీరాముడి పాత్రలో కూడా మహేశ్ ద్విపాత్రాభినయం చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకు మారన్ ఈ చిత్రంలో 'కుంభ' అనే ప్రధాన ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. మహేశ్, పృథ్వీరాజ్ పాత్రల మధ్య నలిగిపోయే కీలకమైన పాత్రలో ప్రియాంక కనిపించనుంది. 2019లో వచ్చిన 'ది స్కై ఈజ్ పింక్' తర్వాత ప్రియాంక చోప్రా మళ్లీ భారతీయ థియేటర్లలోకి వస్తున్న సినిమా ఇదే. దాదాపు 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నానని, ఇది ఒక అద్భుతమైన సాహసయాత్ర అని ప్రియాంక గతంలో తెలిపారు. "ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో-మోషన్ జంప్స్ చాలా చేశాను" అని ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో ఆమె సరదాగా వ్యాఖ్యానించారు. ప్రియాంక ప్రత్యేకంగా కోరడంతో రాజమౌళి ఆమె, మహేశ్ బాబులపై ఒక భారీ డ్యాన్స్ నంబర్‌ను చిత్రీకరించినట్లు సమాచారం. ఇప్పటికే పలు ప్రధాన యాక్షన్ సన్నివేశాలు, ఐమాక్స్ (IMAX) షూటింగ్ షెడ్యూల్స్ పూర్తయినట్లు తెలుస్తోంది. ప్రియాంక పుట్టినరోజున ఈ లుక్ విడుదల కావడంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'దేశీ గర్ల్' భారతీయ సినిమాలోకి పవర్‌ఫుల్‌గా పునరాగమనం చేస్తోందని అభిమా నులు సంబరాలు చేసుకుంటున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.





## రష్మిక మందన్న సక్సెస్‌కు అదే కారణం బృందా మాస్టర్ ప్రశంసలు

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న అంకితభావమే ఆమె విజయానికి ప్రధాన కారణమని ప్రముఖ కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ ప్రశంసించారు. ప్రస్తుతం దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న 'మైసా' చిత్రంలోని ఓ పాటకు కొరియోగ్రఫీ చేస్తున్న ఆమె.. రష్మిక పనితీరుపై సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టు చేశారు. "రిహార్సల్స్ నుంచి షూటింగ్ వరకు నువ్వు పడిన కష్టం, ప్రిపరేషన్ అద్భుతం. ఎన్నో ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నా. ఇంత క్రమశిక్షణ, అంకితభావం, కష్టపడే తత్వం ఉన్న హీరోయిన్‌ను చాలా అరుదుగా చూశాను. నేను చెప్పిన ప్రతి కరెక్షన్‌ను చిరునవ్వుతో స్వీకరించి వెంటనే అమలు చేశావు. నొప్పిలో ఉన్నా నీ ఫోకస్ ఏమాత్రం తగ్గదు. ఈ సినిమా కోసం నువ్వు చేసిన శ్రమ ప్రేక్షకులకు తెరపై స్పష్టంగా కనిపిస్తుంది" అంటూ బృందా మాస్టర్ రాసుకొచ్చారు. 'మైసా' చిత్రంలో రష్మిక ఓ గోండ్ గిరిజన యువతి పాత్రలో కనిపించనుంది. భావోద్వేగాలతో పాటు శారీరకంగా కూడా సవాల్ విసిరే ఈ పాత్రపై ఇప్పటికే ఆసక్తి పెరిగింది. ఈ సినిమాలో ఈశ్వరి రావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతం జేక్స్ బిజోయ్ అందిస్తుండగా, అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ ఆండీ లాంగ్ యాక్షన్ సన్నివేశాలను పర్యవేక్షిస్తున్నారు.

# 'తీర్థరూప తాండేయవారిగే' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!




టీవీ సీరియల్స్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న కొంతమంది, ఆ తరువాత వెండితెరపై కూడా హీరోలుగా అవకాశాలను .. అభిమానులను సంపాదించుకున్నారు. అలాంటి కథానాయకుల జాబితాలో 'నిహార్ ముఖేశ్' కూడా చేరిపోయాడు. తెలుగులో 'గుప్పెడంత మనసు' సీరియల్ లో 'రిషి' పాత్ర ద్వారా పేరు తెచ్చుకున్న కన్నడ నటుడు ముఖేశ్, 'తీర్థరూప తాండేయ వారిగే' సినిమా ద్వారా, వెండితెరకి పరిచయమయ్యాడు. 'అమెజాన్ ప్రైమ్'లో తెలుగులోను ఈ సినిమా అందుబాటులో ఉంది. పృథ్వీ (నిహార్ ముఖేశ్) ఓ ట్రావెల్ వ్లాగర్. మిడిల్ క్లాస్ కుటుంబానికి చెందిన యువకుడు. తల్లితో కలిసి నివసిస్తూ ఉంటాడు. అందమైన .. అనుభూతి ప్రధానమైన ప్రదేశాలకు వెళుతూ, అందుకు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తూ ఉంటాడు. జనంలో అతనంటే మంచి క్రేజ్ ఉంటుంది. అయితే అతనికి మాత్రం జీవితం చాలా వెలితిగా ఉంటుంది. అందుకు కారణం, తన చిన్నతనంలోనే తండ్రి శివ శంకర్ (రవీంద్ర విజయ్) ఇల్లొదిలి వెళ్లిపోవడం. ఎక్కడ ఉన్నాడో ఏమైపోయాడో తెలియకపోవడం. తండ్రిలేని కారణంగా స్కూల్ ఏజ్ మొదలు, కాలేజ్ వరకూ పృథ్వీ ఎన్నో అవమానాలను ఎదుర్కొంటాడు. ఇప్పుడు కూడా 'వాక్ మేన్' అతని ఫ్రెండ్స్ అతనిని ఆ విషయంపై హేళనగా మాట్లాడుతూ ఉంటారు. తన తండ్రి ఎందుకు ఇల్లొదిలి వెళ్లిపోయాడనేది అతని ముందున్న పెద్ద ప్రశ్న. ఆయన ఎక్కడ ఉన్నా వెతికి తీసుకురావాలనే ఒక పట్టుదల అతనిలో బలంగా ఉంటాయి. తన తల్లి జానకి (సితార) విశ్వనాథ్ (రాజేశ్ నటరంగ)తో సన్నిహితంగా ఉండటం పృథ్వీకి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. తండ్రి ఇల్లొదిలి వెళ్లిపోవడానికి తల్లి ప్రవర్తనయే కారణమని అతను భావిస్తుంటాడు. అందువలన ఆమెతో ముభావంగా ఉంటాడు. అతని ధోరణి జానకిని ఎంతో బాధిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే అతనికి అక్షర (రచన ఇందర్)తో పరిచయమవుతుంది. అది కాస్త ప్రేమగా మారుతుంది. ఆమె తండ్రి సీనియర్ జర్నలిస్ట్ రవి రామనాథపుర అని తెలుసుకుని పృథ్వీ షాక్ అవుతాడు. తమ ప్రేమ ఫలించడం కష్టమనే నిర్ధారణకు వస్తాడు. ఒకరోజున రవి రామనాథపుర హఠాత్తుగా చనిపోతాడు. తన కోసం ఆయన రాసి పెట్టిన లెటర్ ను అక్షర చదువుతుంది. అప్పుడు ఆమెకి ఒక చేదు నిజం తెలుస్తుంది. అదేమిటి? పృథ్వీ తండ్రి శివశంకర్ కనిపించకుండా పోవడానికీ, రవి రామనాథపురకి మధ్య గల సంబంధం ఏమిటి? వాళ్లిద్దరికీ సంబంధించిన గతంలో ఏం జరుగుతుంది? అది తెలుసుకున్న అక్షర ఏం చేస్తుంది? తన తండ్రి జాడ తెలుసుకోవాలనే పృథ్వీ కోరిక నెరవేరుతుందా? అనేది మిగతా కథ. ప్రతి ఒక్కరి జీవితంలోను తల్లి - తండ్రి ప్రధానమైన పాత్రలను పోషిస్తారు. ఇద్దరిలో ఎవరు లేకపోయినా, అది మరెవరూ భర్తీ చేయలేని ఒక వెలితిగానే ఉంటుంది. పూర్తి ఆనందాన్ని .. సంతోషాన్ని అందకుండా చేస్తుంది. అలా చిన్నతనంలోనే తండ్రి ప్రేమకి దూరమైన హీరో, అందుకు కారణం తల్లి అనుకుని ఆమెకి తాను దూరంగా మసలుకుంటూ ఉంటాడు. అదే ఆలోచన కారణంగా మనసిచ్చిన అమ్మాయిని కూడా దూరం పెట్టాలని నిర్ణయించుకుంటాడు. చివరికి అతనికి తెలిసే నిజం ఏమిటి? అనే ఆసక్తికరమైన అంశం చుట్టూ ఈ కథను అల్లుకుంటూ వెళ్లారు. తన తండ్రిని జాడ తెలుసుకో వడానికి ఆరాటపడుతున్న పృథ్వీకి, అక్షర సాయపడాల నుకుంటుంది. అయితే అసలు పృథ్వీ తండ్రి కనిపిం చకుండా పోవడానికి కారకుడు తన తండ్రి రవి రామనాథపురనే అనే విషయం అక్షరకి తెలియడం ఈ కథలో మరో కీలకమైన అంశంగా కనిపిస్తుంది. ఇక్కడి నుంచి కథ కాస్త ఊపందుకుంటుంది. అది క్లైమాక్స్ వరకూ అలాగే కొనసాగుతూ వెళుతుంది. క్లైమాక్స్ ట్విస్ట్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. అయితే ఈ కథ చాలా నిదానంగా మొదలవుతుంది. ఫస్టాఫ్ అంతా కూడా చాలా నింపాదిగా సాగుతుంది. హీరోకి తండ్రిలేడనే అసంతృప్తి .. తల్లి పట్ల అసహనం ఉన్నాయనే విషయాన్ని దర్శకుడు సాగదీస్తూ వెళ్లాడు. లవ్ ట్రాక్ అందుబాటులో ఉన్నా పెద్దగా వాడుకోలేదు. ఆ ట్రాక్ కి కాస్త రొమాన్స్ ను జోడించినా, నీరసానికి నిమ్మరసం దొరికినట్టుగా ఉండేది. ఇక హీరో ఎదుగుదలను ఓర్వలేని గ్యాంగ్ ను కూడా కాస్త హైలైట్ చేస్తే బాగుండేది. దీపక్ ఫొటోగ్రఫీ బాగుంది. మేఘాలయ వంటి లొకేషన్స్ ను తెరపై ఆవిష్కరించిన తీరు గొప్పగా ఉంది. జో కోస్టా బాణీలు .. నేపథ్య సంగీతం ఫరవాలేదు. పాటలకి సంబందించినంత వరకూ సాహిత్యాన్ని గురించి గానీ పాడించడం గురించిగాని ఎంతమాత్రం పట్టించుకోలేదనే విషయం అర్థమవుతుంది.

# చిరంజీవికి పెళ్లికార్డు అందించిన బండ్ల గణేశ్- ఫొటోలు ఇవిగో!



ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్ తన కుమార్తె జనని వివాహ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి దంప తులను సాదరంగా ఆహ్వానించారు. శనివారం చిరంజీవి నివాసానికి తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన బండ్ల గణేశ్, ఆగస్టు 16న జరగనున్న వివాహ వేడుకకు హాజరు కావాలని కోరుతూ చిరం జీవి, సురేఖ దంపతులకు వివాహ పత్రికను అంద జేశారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తం చేస్తూ ఒక పోస్ట్ చేశారు. "నేను చిత్ర పరిశ్రమలోకి రావడానికి స్ఫూర్తినిచ్చిన అన్నయ్య చిరంజీవి గారి ఆశీస్సులు లభించడం ఎంతో ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. చిరంజీవితో దిగిన ఫొటోలను పంచు కుంటూ అనే హ్యాష్ ట్యాగ్‌ను జతచేశారు. ప్రస్తు తం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారి ంది. బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం, పశ్చి మ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజ చిలుకూరితో జరగనుంది. ఆగస్టు 16న ఉదయం 11:58 గంటలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ హాల్‌లో ఈ పరిణయ మహో త్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే మే నెలలో జరిగిన నిశ్చితార్థం, పసుపు కుంకుమ కార్యక్రమాలకు చిరంజీవి, సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143